510


ఆంధ్రరాష్ట్ర ప్రారంభవిద్య

ANDHRA RASTRA PRARAMBHA VIDYA

విద్యావిషయిక మాసపత్రిక

సంపుటము 41] [సంచిక 11

15 ఫిబ్రవరి 1953



సంపాదకులు:

శ్రీయుత మహావాది వేంకటరత్నముగారు బి.ఏ.

వ్యవస్థాపకులు:

శ్రీయుత ఉదరు వెంకయ్యగారు.

విషయసూచిక

Regd. M.N. 3766

సం॥ర చందా రు 1—0—0

ఆంధ్రరాష్ట్ర ప్రారంభవిద్య

విద్యావిషయిక మాసపత్రిక

సంపుటము 41] ఏలూరు, ఫిబ్రవరి 15 [సంచిక 11



వివరణము :

సత్యమెన్నడును నశింపదు. సత్యాన్వేషణయందలి ప్రయత్నమెన్నడును వ్యర్థము గాదు. మనకు ఓపికయు, పట్టుదలయు, దైవమునందు అచంచలమగు విశ్వాసమును ఆవశ్యకములు. ఇంతకన్న మఱేమికావలెను ? జీవితముకొఱకే- అనగా విశాలభావములు విశాలదృష్టికొఱకు మాత్రమే- జీవింపదగును. ఇతరుల మెప్పునకు మాత్రమెన్నడును ప్రయత్నింపరాదు. సత్యారాధన మనలో దృఢసత్వమును, విశ్వాసమును, బుట్టించును.

సంకీర్తనము :

హే జ్యోతిస్వరూపా ! నిత్యమూర్తీ ! నా హృదయమున నీ సత్యజ్యోతి వెలుంగనిమ్ము. నా హృదయమున నీచభావములకు తావొసంగకుము. భక్తి విశ్వాసములతో నిన్నారాధింతును గాక !

స్వామిరామతీర్థ

*** ఆంధ్రరాష్ట్రం ***

రుద్రాభట్ల - వేంకట భాస్కరరావు - చాపర

లెండు, రండు యువకులార !
ఆంధ్రమాత తనయులార !
అదనుయిదే ఆనందపు కడనుద్రొక్క‌గ
ఆంధ్రరాష్ట్ర మవతరింప - అంధకారమంత
రింప। తెలుగుబిడ్డ తెప్పరిల్ల - తెలుగు
జ్యోతి తేజరిల్ల ॥లెండు, రండు॥
కృష్ణాగోదావరీలు-యిష్టఫలము లీనుచుండ
కరువు మెరువు బాధలపుడె - కానరాక
పారిపోవ ॥లెండు॥

బాలచంద్రు పటుధీరత - అల తిక్కన రణ
చతురత । మేటి పొట్టిరాము ఘనత-
ఆంధ్రజాతి వీరుల-కాదర్శమానురా!
॥లెండు॥

ఆంధ్రరాష్ట్ర భావిప్రతిభ-యెందుగన్న
వెలుగునొందు। ఆంధ్రయువకులార! లెండు
నడుముగట్టి - నడువరండు!
॥లెండు॥

రాష్ట్రతపసి

గీ. పొట్టి శ్రీరాము నొకని బోగొట్టుకొంటి । మకట ! ఆంధ్రరాష్ట్రాభ్యుదయంబుకొఱకు
జాతిరత్నంబు నేడిట్లు జారిపోయె । కాంతిశీలను జిమ్మి దిక్తటములందు,

మ. బలిగా నిచ్చియు నాంధ్రరాష్ట్రమునకున్ ప్రాణాలు సద్భక్తితో
వెలయన్ జేసితి వాంధ్రకీర్తిరమ నీ విశ్వప్రపంచంబులో ;
మొలచున్ నేడిక నీదుమృత్తికను సంపూర్ణాంధ్రవృక్షంబు ; పు
వ్వులు గాయల్ మఱిపండ్లునై నిలుపఁగన్ బూర్వంపు టౌన్నత్యమున్.

గీ. ఎట్టిదైనను శ్రీరామ చుట్టి ముందు । ప్రాయు టాచారమగు టది బాయకుండ
పొట్టిశ్రీరాము నామంబు చుట్టఁబడియె । ఆంధ్రరాష్ట్రాని కీనాఁడు ఆదియందు,

గీ. తనదురాజ్యము ననుగుసోదరున కిచ్చి । త్యాగి యాయెను శ్రీరాముఁ డపుడుచూడ
తనదుప్రాణాల ననుఁగుసోదరులకిచ్చి । త్యాగియాయెను శ్రీరాము లకట నేఁడు.

గీ. చెండి యిచ్చెను కండలు శిబిన్నృపుండు తీసి యిచ్చెను వెన్ను దధీచితపసి
అట్టివారిని మించి ఈ పొట్టివరుడు । పంచప్రాణాలు మనకు నర్పించె నేడు.

గీ. పొట్టిశ్రీరాము! నీవింత గట్టిపట్టు । పట్టి ఈనాఁడు తెలుఁగుల మట్టికొఱకు
మట్టిమై పోతి వింక నీమట్టిమీఁద । పుట్టి పెరుగును తెలుఁగుల చెట్టు నేఁడు.

గీ. కాంచకున్నను భవదీయ కరుణమూర్తి । గాంచకున్నను నీదు విగ్రహము నిచట
డెందమందున నీరూపు కందళించి । భావి నడపించు నిఁక మృతజీవి నగుట.

గీ. చిరము జీవింప దపముల జేయువారి । గాంచితిమి కాని ఈరీతి గడగి చావు
గోరుకొనువారి నెచ్చటఁగూడఁ గనము । స్వాగతము నీకు స్వర్లోకవాసు లిడరె?
గీ. ఆంధ్రనామంబు పూర్తిగా నమరు నీకు । ఆంధ్రభూమికి నీదు ప్రత్యణువు నిచ్చి
ఆంధ్రమృత్తిక నీదు ప్రత్యణువు గలిపి । ధన్యతను గాంచు జాతిరత్నంబ వీవు.
గీ. బ్రతికి సాధింపవచ్చు నేపనినినైన । చచ్చి సాధింప నెవ్వారి సాధ్యమగును?
బ్రతికి సాధింప లేనట్టిపనిని నీవు । చచ్చి సాధించితివి; ఎట్లు సన్నుతింతు?
గీ. వాంఛ తీరంగ నిరశనవ్రతము బూని। ఆంధ్రరాష్ట్రముకొఱకు ప్రాణాల నిచ్చు,
పొట్టి శ్రీరాము కాలాన బుట్టియుంట । దలఁప మనజన్మ లెంతయు ధన్యమాయె.
చం. ఎఱుఁగము మేము పూర్వమున ఈవిధి పోయెడివారి నెవ్వరిన్,
అరయ జితేంద్ర దా సొకఁడు అర్పణమాయెను; దేశముక్తికై
యొరవడి దీక్షబూని యసువుల్ త్యజియించెడువారి జూతుమే?
ధర, గన మీరలిద్దఱు గదా! కలికాలపు తాపసోత్తముల్.
చం. నిజముగ నీకు జీవముల నిల్పఁగశక్యమె? ఏరికైన, నా
యజుఁడు లిఖించి నీనుదుట "ఆంధ్రుల కాహుతి నిచ్చి ప్రాణముల్,
సృజనయొనర్పుమీ తెలుఁగు సీమకు సీమనటంచు బంపఁగా;
సుజనహితుండ! నీకు మృతి జూడగ దోచెడి నిట్టిభావముల్.
ఉ. నీవు మహానుభావుఁడవు! నిక్కము; ఎంతటిదాఁకఁబోయినో
తావక కీర్తికాంత; మఱి తప్పక మాదగు దుర్యశంబునుం
బోవును అంతదాక, "తమ పూజ్యుని నాంధ్రులు బాసిరంచు" ఈ
భావము నేఁడు మాతలలు వాల్చఁగఁ జేసెను త్యాగమూర్తిరో!
చం. ముదిరిన రాష్ట్రప్రేమ నిను ముందు వరింపఁగ; మానవాళికిన్
పద మిడలేని నూతనపు బాటను పోతివి తోడిసోదరా
భ్యుదయము గోరి నీమదిని; పున్నెపునేల లవేమి నోచెనో?
మృదువగు నీపదాబ్జముల మీఁద ధరించి తరింపఁగా నిఁకన్.
ఉ. నీకయి దుఃఖమున్ మదిని నిల్పక యెట్లు సహింతుమయ్యా, సు
శ్లోకుఁడ వీవు: ఈ చెనటిలోకము నిస్పృహవీడినావు; శో
భాకరమూర్తి! నీ వితర వాంఛల గోరక లక్ష్యసిద్ధికై
నాకము జేరినావు; సుగుణాకర। శాంతిని బొందు మచ్చటన్.

గుంటూరి పేరిశాస్త్రి, టీచరు - మోగల్లు.

*

ప్రాథమికవిద్య అభివృద్ధి కావాలంటే

ప్రపంచమునకు జ్ఞానభిక్ష పెట్టినది భారతదేశం. అన్యదేశీయుల కందరాని వైదికవిజ్ఞానాన్ని ఆకళించుకొని, జీర్ణించుకొని, తృప్తిచెంది పాశ్చాత్యుల కందించి, ప్రపంచమున మింటిమానికమువలె తేజరిల్లినదీ భారతమాత. చతుష్షష్టి కళల చతురతనొంది ప్రపంచమును సవాలుచేసినదీ భారతఖండము. సకలవిద్యలకు మూలాధారము ప్రాథమికవిద్య. సస్యమునకు క్షేత్రమువలె మానవాభ్యున్నతికి ప్రాథమిక పాఠశాల ప్రధానము. ప్రాథమిక విద్యాదశయందు బలపడిననే గాని ఉన్నతవిద్యాశిఖరము నందుకొనజాలడు మానవుడు. స్వాతంత్ర్యవాయు వీచికలు యథేచ్ఛగా వీచు యీనాడైనను ప్రజలదృష్టి ప్రాథమికవిద్యపై ప్రసరించుటలేదు, ఇది శోచనీయము. అశుభదాయకము. పరపరిపాలనా ఫలితముగా నేర్పడిన మానసిక పరిణామము ననుసరించి ఉన్నతవిద్యపై యూగులాడుచున్న మన వారి యూర్ధ్వదృష్టి దానికాధార భూతమగు ప్రాథమిక విద్యపై ప్రసరింపకుండుట పునాదిపై నిర్లక్ష్యభావమునూని, భవన నిర్మాణమును దలపెట్టువారి మనస్తత్త్వమును బోలునట్టిది.

ప్రాథమికవిద్యావ్యాప్తి ప్రభుత్వము పాఠశాలల యజమానులు (మేనేజర్లు) అందు పనిచేయు నుపాధ్యాయులు వారి నాదరించు పౌరులపై నాధారపడియున్నది. ఇందు పరస్పర సానుభూతి సహకారములు ప్రధానములు. ఇదినిర్వివాదాంశము. ప్రాథమిక విద్యా ప్రాధాన్యమును ప్రభుత్వము గ్రహించియు, ఆర్థికమాంద్యముచే కాబోలు వలయుదోహదమియ్యలేకున్నది. పాఠశాలలయజమానులు పాఠశాలల సక్రమ నిర్వహణమునకై ప్రభుత్వమిచ్చు ద్రవ్యము చాలకుండుటచేతను, అదనపువిత్తమును చేర్చుటకు తగుఆర్థిక స్తోమతు కలిగియుండకపోవుటచేతను, అతికించినరీతిగ పాఠశాలలను నిర్వహించుట కష్టులగుచున్నారు. అందు పనిచేయు నుపాధ్యాయులు తమకు ప్రభుత్వమిచ్చు జీతము లతిస్వల్పములగుటవలనను, కుటుంబ భారముధికమై దుర్భరమగుటచేతను, నిరుత్సాహము—దేహదౌర్బల్యము — జనింపవారి విధ్యుక్తధర్మమును త్రికరణశుద్ధిగ నెరవేర్చలేకున్నారు. పాఠశాలా నిర్వహణమునగల తమ ఆర్థిక అశక్తతను పురస్కరించుకొని, యజమానులు ఉపాధ్యాయులకడ ప్రభుత్వమొసగు గ్రాంటులో కొంతమినహాయించి, నిర్వహణ వ్యయమున కొంతభారమును వారిపై మోపుచున్నారు. ఇది బహిరంగము కాని నగ్నసత్యము. కాని ప్రభుత్వమిచ్చు పూర్తిమొత్తము ముట్టినట్లుగ బట్వాడ రిజిష్టరులో సంతకములు మాత్రము అద్దంలాగ గోచరించును. ఉద్యోగరక్షణార్థం ఉపాధ్యాయులు దీనికియ్యకొనుట తప్పనిసరియై గోరుచుట్టుపై రోకటిపెట్టునుగూడ గత్యంతరములేక అనైచ్ఛికంగా భరించుచున్నారు. ఇట్టి గాయి కసాయి తనమును గుర్తించియు ప్రభుత్వముగాని, ప్రజలుకాని, తన్నివారణోపాయమును కనుగొనకుండుట ప్రాథమిక విద్యకు గొడ్డలి పెట్టని బుద్ధిమంతులకు వేరె చెప్పవలెనా! భావిభారత నిర్మాతలగు బాలబాలికలను తేజోమూర్తులుగ తయారుజేయు నుపాధ్యాయుల నిరుత్సాహస్థితి యావద్భారతమునకే గాక యావత్ప్రపంచమునకు అరిష్టదాయకము. కాన దేశౌన్నత్యమును ఆకాంక్షించు ప్రతిదేశభక్తునకు, తాను కన్న బిడ్డలఅభ్యున్నతి నపేక్షించు ప్రతితండ్రికి, ప్రథమ కర్తవ్య ముపాధ్యాయ లోకమున కున్నతి చేకూర్చుటయే. శివాజీవంటి వీరులకు, గాంధివంటి త్యాగులకు, రాయలవంటి విద్యాభిమానులకు, ఆంధ్రకేసరి వంటి ధీరులకు, తిక్కనవంటి కవులకు, పోతనవంటి భక్తులకు, సక్రమమార్గమునుజూపునది యుపాధ్యాయుడేకదా! అట్టి పవిత్రమూర్తియగు ఉపాధ్యాయుని యుసురు భారత భవితవ్య భాగ్యరేఖను వక్రింపచేయదా! నేలవిడిచి సాముసేయ పూనుకొనుట ధీమంతుల లక్షణమా! ప్రజలసహకారము లేనిదే ప్రభుత్వమేమి చేయగలదు? కనుక ప్రజలు ప్రాథమిక విద్యాభ్యున్నతికి గల ప్రాధాన్యమును గుర్తించి, తదున్నతి కశేష కృషియొనర్చుటాత్మ శ్రేయము నాకాంక్షించుటయే యని నా అభిప్రాయము.

ప్రాథమికవిద్య అభివృద్ధి పొందవలెనన్న పాఠశాలల నిర్వాహకవర్గము లగు నార్థికబలము కలిగి విద్యావ్యాప్తి యం దనివార్యోత్సాహయుతులై యుండవలెను. ఆదాయము నాకాంక్షించునదిగా యుండరాదు. ప్రాథమికపాఠశాలలు భావిభారత రథ్య సార్వభౌమకుడ్యములకు పునాదుల నేర్పరచు పవిత్రసంస్థలు కాని వ్యాపారపుటంగళ్ళు కావు. రాబడిననుసరించి ఖర్చు అను మనస్తత్త్వముగూడ నింద్యము, నింద్యమే కాన వేరురాబడిలేక ఉన్నను

ఉపాధ్యాయసంఘాల గుద్దులాట

కాకరపర్తి కామేశ్వరశాస్త్రి, బేసిక్ టీచర్, ఖండవిల్లి.

ఆదేమిచిత్రమోగాని యీ రోజులలో ప్రతివారు ప్రజాసేవచేయుటకు పోటీపడుచున్నారు! 8 లక్షలు ఖర్చుపెట్టి ఓట్లుకొనినపెద్దమనిషియు, తాను శాసనసభాసభ్యునిగా యెన్నికగుట ప్రజాసేవచేయుటకే యనును. జీతము, నాతములేని జిల్లాబోర్డుప్రెసిడెంటు, మ్యునిసిపల్ చైర్మన్, మొదలగు పదవులకుకూడా లక్షలు గుమ్మరించిన పెద్దమనుష్యులు ప్రజాసేవచేయుటకే యని చెప్పుచుందురు. ప్రజాసేవ చేయుటకు యింత ధనవ్యయ మెందులకు? యితరులతో పోటీపడుట యెందులకు? నిజముగా ప్రజాసేవయే పరమావధిగా గలిగి, అహింసాపద్ధతులలో ఆర్థిక అసమానత్వ నిర్మూలనకొరకు పాదచారియై, దేశమంతయు తిరిగి, భూదానయజ్ఞము నిర్వహించుచున్న ఆచార్యభావే ప్రభృతులుయితరులతో పోటీపడరేమి? అంతే ఈలా నోరుచించుకొనే వారంతా ప్రజాద్రవ్యాపహరణచేయుటకుమాత్రమే పోటీపడుచున్నారు. ప్రజాసేవయే పరమావధిగాగల వారికి పోటీల ప్రశక్తియేలేదు.

దురదృష్టవశాత్తు ప్రాథమికోపాధ్యాయలోకమునకుకూడా యిట్టిస్థితియేకలిగినది. అధోగతిలోనున్న ప్రాథమికోపాధ్యాయులను సంఘటితపరచి, వారి సదుపాయములకై పోరాడుటకుగాను పోటీలు యేర్పడినవి.

ఇట్టిసంఘములలో ప్రస్తుతము ఆంధ్రరాష్ట్ర ప్రాథమికోపాధ్యాయ ఐక్యసంఘము వారికిని, పోషకపాఠశాలల యజమానులు - ఉపాధ్యాయుల సంఘనిర్వాహకులైన శ్రీ క్రొత్తపల్లి సీతారామయ్యగారికిని, వాదోపవాదములు శ్రుతిమించుచున్నవి.

ఐక్యసంఘాధినేతలు "ప్రాథమికోపాధ్యాయలోకములో వివిధ యాజమాన్యములలో పనిచేయువారు భిన్నసంఘములు నిర్వహించుటవలన ప్రయోజనము శూన్యము. కావున అందరు సంఘటితమై తమ హక్కులకోసం నిరంతరాందోళన జరుపవలయును." అని చెప్పుటయేగాక శ్రీసీతారామయ్యగారు ఉపాధ్యాయులద్రవ్యము నపహరింతురనియు, ఆసొమ్ముతో లోగడ యిల్లు కట్టుకొనిరనియు, ఇంకను పైకప్పు తయారుకాలేదనియు, దానికిగాను యీ సంవత్సరము మరల ధనముప్రోగుచేసి పైకప్పు పూర్తిచేయ సంకల్పించిరనియు, బహిరంగముగా చెప్పుతున్నారు.

శ్రీ సీతారామయ్యగారు, ఐక్యసంఘ నిర్వాహకులలో చాలామంది కమ్యూనిష్టులనియు, ప్రభుత్వవ్యతిరేకతయే వారి పనియనియు, వీరిమాటలలో పడినచో ఉపాధ్యాయులు కడు యిడుమలపాలగుదురనియు, క్లిష్టపరిస్థితులలో వీరు అజ్ఞాతవాసమున కేగుదురనియు, దానిలోచేరి అనేకమంది తమజీవితములను నాశనము చేసికొనిరనియు, ప్రచారము చేయుచున్నారు.

---

౨౦ వ పేజీ తరువాయి

విద్యావ్యాప్తియందుత్సాహము ముఖ్యమై ప్రభుత్వమిచ్చు ద్రవ్యము పూర్తిగనో, లేక కొంతభాగమునో, వెచ్చించి పాఠశాలల నడుపుచున్న ద్రవ్యసహాయక పాఠశాలల నిర్వాహకులు ప్రభుత్వపు నిబంధనల కండ్లనుగప్ప యత్నించి, పాఠశాలలలో చీకటి బజారులను నిర్మించి భావిభారతిని అగాధమున ద్రోయుటకన్న తమ అశక్తతను ప్రభుత్వమున కెఱుకపరచి భారతాభ్యున్నతికిబాధ్యతవహించవలసినప్రభుత్వముగాని, ప్రభుత్వముచే ప్రజాపాలనకై ఏర్పరచబడిన ప్రజాసంస్థలుగాని, ఇట్టి పాఠశాలల నిర్వహణ బాధ్యత వహించుట ప్రథమ కర్తవ్యము. బాధ్యతగల నిర్వహణమునసే గాని పాఠశాలల నిర్వహణోద్దేశము సఫలీకృతముగానేరదు. దీనిని ప్రభుత్వపు దృష్టికి కొని తెచ్చుట ప్రజలకర్తవ్యము. ప్రజలు దీని యథార్థమును గ్రహించి సత్వరము ప్రాథమిక విద్యావ్యాప్తికి సరియగు పదకము నేర్పరుప ప్రయత్నించి, సఫలీకృతులగుటకై సర్వదా సర్వేశు, సర్వమయు, సర్వజ్ఞు ప్రార్థింతును.

యస్. సుబ్రహ్మణ్యం,
ప్రెసిడెంటు,
టీచర్సు యూనియన్, విజయనగరం.

ఉపాధ్యాయుల సంఘములతో పరిచయము గలిగినవారికే పరస్పర దూషణపద్ధతి, కడు నీచముగా గన్పట్టకమానదు.

ప్రథమమున ఐక్యసంఘమువారిని గురించి చర్చింతము.

వీరు లోగడ ఉపాధ్యాయులలో సంచలనము కలిగించి, వారిచే సమ్మె చేయించుట జరిగినది. ఆ సమయములో పలువురు ఉపాధ్యాయులు తమసర్టిఫికెట్లను పోగొట్టుకొనిన మాటకూడా వాస్తవము. పెద్ద పలుకుబడిలేకపోయినప్పటికిని అప్పటినుంచియిప్పటివరకు ఆ సంస్థ నిర్వహించబడుచునే యున్నది. కాలక్రమమున దాని ప్రధాన కార్యదర్శిగారైన శ్రీ సింగరాజు రామకృష్ణయ్యగారు ఉపాధ్యాయులపై ప్రభుత్వమువారు చేసిన చట్టములుకొన్ని చెల్లకూడదని హైకోర్టులో దావావేసి గెలుచుటతో వారి పలుకుబడి హెచ్చినది. దీనికితోడు వీరికి ప్రత్యేకముగా ఒక పత్రికయుండుటచే దాని ద్వారా వారు ప్రచారముచేసుకొన గల్గుచున్నారు. ఇంతలో శ్రీ రామకృష్ణయ్యగారు ఉపాధ్యాయ నియోజకవర్గమునుండి మదరాసు కౌన్సిలుకు సభ్యులుగాయెన్నికైరి. దానిలోవీరిపలుకుబడియినుమడించినది. వారు ఆంధ్రదేశమంతయు తిరిగి, ఉపాధ్యాయలోకములో ప్రచారముచేసి, తమసంఘములో విరివిగా సభ్యులను చేర్చుచున్నారు. ఈ సంఘంవారికి కమ్యూనిష్టులతో సంబంధమున్నదన్న సీతారామయ్యగారి వాదన - దానినిర్వాహకులను, వారి ఆందోళనా విధానమును, వారిపత్రిక ప్రచురించు విషయములను, అనేక కోణములనుండి పరిశీలించినచో నిజమనియే తోచగలదు. అందువలన వారు తమకు కమ్యూనిష్టులతో గాని,మరేరాజకీయపార్టీతో గాని సంబంధములేదని, దాని ఆదేశప్రకారము తాము నడుచుకొనమని, మనస్ఫూర్తిగా బహిరంగముగా చాటవలసియున్నది. కాని వారేలనో అట్లు చేయుటలేదు. ఆ ఒక్క విషయము మినహాయించిన ఈ సంస్థను ఉపాధ్యాయలోకము ఆదరింపవచ్చును.

ఇక శ్రీ సీతారామయ్యగారి సంగతిని పరిశీలిద్దాం. వీరు కడుదుర్భర సమస్యలతోనుండుచున్నా పోషకపాఠశాలోపాధ్యాయుల కొఱకు పాటుపడుట మిక్కిలి అభినందింపదగిన విషయము. కాని వారిపై జరుగుచున్న, ప్రచారమునకు, సమాధానము చెప్పకొన వలసియున్నదని నేను వారికి వ్యక్తిగతముగా మనవిచేయుచున్నాను. వారినుండి సమగ్రమైన జవాబు ఉపాధ్యాయ లోకమునకు వెంటనే లభించగల దని యాశించుచున్నాను. కాని నేను పైన చెప్పిన పద్ధతిలో ఐక్యసంఘము వారున్నయెడల శ్రీ సీతారామయ్యగారి ప్రత్యేకసంఘము ఐక్యసంఘములో చేరిపోవుటయే, యేవిధముగా చూసినను శ్రేయస్కరము. ఈవిషయములో, ప్రస్తుతకాంగ్రెస్ ప్రభుత్వమునకు మద్యపాననిషేధ కార్యక్రమమును విరమించుకొనుటకు అభిమానము అడ్డువచ్చుచున్నట్లు వారికి అభిమానము అడ్డురాకూడదు.

ఈ రెండు సంఘములను విశాలభావముతో పరిశీలించినచో ఒకటి ప్రతివిషయములోను ప్రభుత్వమును దుయ్యబట్టుటయే ప్రధానముగా గలదిగను, వేరొకటి ప్రభుత్వమునకు ప్రక్కతాళము వేయునదిగను, గోచరించగలదు. ఈ రెండు విధానములు కూడ మనకు అవశ్యము వర్జనీయములే.

ఉపాధ్యాయ లోకమంతయు బలీయమైన సంఘముగా నేర్పడి దానికి ప్రతిప్రాంతములోను శాఖల నేర్పరచి, సమైక్యముగా చట్టబద్ధముగురీతిని ఆందోళన చేయవలయును. ప్రభుత్వము మంచిచేయుచో దాని నభినందించుట, చెడుచేయుచో విమర్శించుట, చేయవలెను. అంతేగాని వారుచేయు ప్రతిచట్టమునకు అపార్థము కల్పించి, దూషించుట ప్రజాస్వామిక దేశప్రజలమైన మనకు తగనిపని.

ఈ రెండు సంఘములవారి వాదోపవాదనలు, ఆంధ్రనాయకులు ఆంధ్రరాష్ట్ర సంపాదన కొఱకు వేరువేరుగా నోరుచించుకుంటూ,ప్రకటనలతో పత్రికలనునింపుతూ,తమ అనైక్యతవల్ల ఆంధ్రులకు అన్యాయం చేయడమేగాక ఇతరులయెదుట మన బ్రతుకు అపహాస్యంచేస్తున్నట్లే వీరివాదనలు కూడ ఉపాధ్యాయులకు నష్టముతప్ప లాభముచేకూర్చనేరవు. ప్రభుత్వము మనలోని అనైక్యతను సాకుగా తీసికొని, మనకు సంఘటితశక్తి లేదని నిరూపింప గలదు.

కావున ఈ సంఘముల వారిని ఒకచో జేర్చి వారివారికి గల విభేదములను చర్చించి, వాటిని నివారించి, మొత్తము ఆంధ్రరాష్ట్ర ప్రాథమికోపాధ్యాయుల నందరిని ఒకేసంఘముగా నేర్పరచి, మన పురోభివృద్ధిని సాధించుటకు పూనుకొనుటయుక్తము.

ఐతే ఈవిషయములో ఉపాధ్యాయులను గూర్చి కూడా యొకింతుక యోచించక తప్పదు. ప్రాథమికోపాధ్యాయులలో పెక్కండ్రు తమస్వకీయ సాంసారిక, ఆర్థిక, ఉద్యోగ, సమస్యలతోనే సతమతమగుచు, లోకజ్ఞానము నార్జించుటకు శక్తిలేని

ఉ ప వా చ క ము లు

ఓలేటి పంచముఖేశ్వరరావు,

ఉపాధ్యాయలోకానికి నమస్సులు. నేడు తర్కించవలసిన విషయం ప్రాథమిక పాఠశాలల్లో ఉపవాచకముల అవసరానవసరములు—

అయితే యీవిషయంలో కొంతమంది ఉపాధ్యాయుల అభిప్రాయం ఉపవాచకములు అనవసరమనియే—ఎందుచేతనంటే 30 వచనపాఠాలు, 5 పద్యపాఠాలు, ఇంకా కొన్ని నీతిపద్యాలు, పైగామరికొన్ని వ్యాకరణాభ్యాసాలతో కూడియున్న, వాచకమును పరిపూర్తిచేయటానికి సంవత్సరం సరిపోతుంది. అటువంటప్పుడు ఈ ఉపవాచకాల్ని చదివించుటకుగాని, చెప్పుటకుగాని. వ్యవధి ఎక్కడిది?

నేచర్ స్టడీ, సివిక్సు, జాగ్రఫీ, ఇత్యాది తదితర సబజక్టులతో కోర్సునుపూర్తిచేసేసరికి తలమునిగితాళప్రమాణమవుతోంది. అటువంటి సందర్భాలలో ఉట్టికెగరలేనమ్మ స్వర్గానికెగురునట్లు యీఉపవాచకాలగోడవెందుకు? కొందరి ప్రముఖుల ఉద్దేశమిది.

నాఅభిమతమేమనగా – ప్రాథమికపాఠశాలలలో ఉపవాచకాలు అత్యవసరమని– ఈ సందర్భంలో ముందుగా ఈక్రింది విషయాన్నిగూర్చి ఆలోచించాలి.

1. ఉపవాచకమనగానేమి? తరగతిలో ప్రధానముగా చెప్పబడక వారమునకు ఒకటి రెండుపర్యాయాలు నామమాత్రంగా చెప్పబడేది, లేదా విరామసమయంలో పిల్లలకు పనికల్పించునది.
2. ఉపవాచకమును చదువుటలో పిల్లలకు ఉత్సాహముంటుందా? బాగా అక్షరజ్ఞానం వచ్చినతర్వాత బాలబాలికలకు

౨౫౭ వ పేజీ తరువాయి

వారైయున్నారు. అందువలన వయోజన ఓటర్లకు, వారు నిరక్షరాస్యులగుటచే వారికి రాజకీయపార్టీలు అబద్ధములు నూరిపోసి, లేనిపోని ఆశలుచూపి, లోబరచుకొన్నట్లే, ఉపాధ్యాయులకును అసాధ్యములైన ఆశలుచూపి, వారిని తమవైపుకు త్రిప్పుకొనుటకు యీ సంఘములును ప్రయత్నింపవచ్చును. ఉపాధ్యాయులు గొఱ్ఱెల మన స్తత్వమును వీడి యీ సంఘముల స్వభావాదులను పరిశీలించి, వాటిని బలపరచుటయు క్తము.

అందుకుగాను ఉపాధ్యాయులలో చైతన్య మవసరము. యుక్తాయుక్తవిచక్షణ జ్ఞానమావశ్యకము. ఈ విషయములో ఉపాధ్యాయునులను గూర్చి యొకింతచెప్పవలసి యున్నది. వీరిలో జాగ్రత్తిగా చైతన్యముగన్పట్టుటలేదు. ఇందుకు, వారు యెన్నియో యిబ్బందులకు లోనగుచుండుట కారణమైయుండవచ్చును.

ఉదాహరణకు యిటీవల జరిగిన తణుకుతాలూకా ఐక్యఉపాధ్యాయ మహాసభకు వందలాదిగా ఉపాధ్యాయులు హాజరైనను ఉపాధ్యాయినులుమాత్రము ఇరువురే హాజరగుట జరిగినది. తణుకు పట్టణములోని వారు వచ్చినను చాలామంది యగుదురు, ఇది కేవలము "మనకెందుకు లెద్దూ!" అనుమన స్తత్వము వల్ల కలుగు చున్నది. ఈ మన స్తత్వం సోదరీమణులలో నశించాలి వారి కవసరమైన కోరికల సిద్ధికొఱకు వారుకూడ ఉపాధ్యాయ సంఘాలలో బాధ్యతాయుత పదవులను స్వీకరించి, పాటుపడవలసి యున్నది. అప్పుడే మనసంఘములు శక్తివంతములై, హక్కులను సాధింపగలుగును.

చివరిసారిగా నేను మనవి చేయునదేమనగా ఉపాధ్యాయసంఘ నిర్వాహకులు పదవీ వ్యామోహమును, పరస్పర నిందాపూరిత ప్రకటనలను,మాని, సేవాబుద్ధితో ఐకమత్యంగా మెలగాలి. వారు అలా నడచుకొను నట్లు ఉపాధ్యాయులందరుచేయగల్గాలి, అనాడే మనసంఘాలు యేమైన సాధించగల్గుతాయి. అంతవరకు, అవిపరస్పర దూషణలే, చేసుకుంటాయి.

ఏవేవో పుస్తకాలు చదువవలెననే కుతూహలముంటుంది. ప్రతినిత్యం పాఠశాలలో బోధజరుగుతూవుండే వాచక పుస్తకం మీాదకంటే ఉపవాచకం మీాదనే పిల్లలకు మక్కువ ఎక్కువ. పెద్ద క్లాసు పిల్లల్లోకూడా టెక్స్టుపుస్తకాలకంటె ఉపవాచకాలు, మాసపత్రికలు, నవలలు, వీటిమీాద అభిరుచి జాస్తిగా వుంటుంది.

3. ప్రాథమిక బడులలో ఏతరగతులకు ఉపవాచకాలు అవసరం? నాల్గయిదు తరగతులకు అవసరం. ఈతరగతుల్లోకివచ్చేసరికి పిల్లవాళ్ళకి ధారాళంగా చదివే వాచకజ్ఞానం కుదురుతుంది. క్రింది తరగతుల్లో అక్షరజ్ఞానం చదివేనేర్పు మిక్కిలి ప్రారంభదశలో వుంటుంది కాబట్టి, ఆ తరగతులకు ఉపవాచకాలుఅనవసరము.

4. ఉపవాచకాలు ఎట్లా ఉండాలి? మిక్కిలి సులభశైలిలోనూ అత్యంత సరళమైన భాషలో, సుందరమైన పటములతోనూ, పెద్దటైపు అక్షరాలతోనూ, మిక్కిలిఆకర్షణీయంగా ఉండాలి. పుస్తకాన్నిచూడగానే పిల్లల్లో పఠనాసక్తి ఉత్పన్నంకావాలి.

5. ఉపవాచకాల్లో ఏలాంటి పాఠలుండాలి? ఉపవాచకముల ప్రధానోద్దేశము భావి పౌరులు కాబోయే బాలబాలికలను, సత్ప్రవర్తన, భగవద్భక్తి, దేశాభిమానము, ఉత్తమశీలము, ధైర్యసాహసములు, కలవారినిగా తయారుచేయుటయే. ఇటువంటి ఆశయములను ఉద్బోధించే పాఠాలే. వీటిలో వుండాలి. ఏ ఉపవాచకమైనాసరే ముప్పది పుటలకు మించివుండరాదు.

6. ఉపవాచకములకు ఎట్టిపేర్లుండాలి?- ఈ మోస్తరు పేర్లుంటే బాగుంటాయి. నీతికథామంజరి, భరతవీరులు, మహాభక్తులు, ఆంధ్రమహిళలు, దేశాభిమానులు, వీరారాధన, కవిపూజ, తెనుగుతల్లి, మననాయకులు, ఆంధ్రప్రతిభవగైరా॥

7. ఏమాదిరిపాఠాలుండాలి?- పంచతంత్రం నీతిచంద్రిక మొ॥ గ్రంథాలలోనికథలూ, శివాజీ, రాణాప్రతాప్, రాయలు మొ॥ వారి చరిత్రలు ఏసుక్రీస్తు, బుద్ధుడు, సోక్రటీస్ మొ॥జీవితాలు ప్రహ్లాదుడు, ధ్రువుడు, రామదాసు, కబీరు మొ॥ భక్తిప్రపత్తులూ- రుద్రమదేవి, మాంచాల, ఝాన్సీ మొ॥ సాహసవిక్రమాలూ, గాంధి, నెహ్రూ, పటేల్ మొ॥ దేశసేవాసక్తులూ, తిమ్మరుసు, యుగంధరుడు మొ॥ శేముషీప్రతిభలూ, నన్నయ, శ్రీనాథుడు, పోతన్న, మొ॥ వారి కవితా చమత్కారాలూ ఇటువంటివన్నీ, ఇంతేగాక సంగ్రహభాగవతము, సంగ్రహభారతము, సంగ్రహరామాయణము, ఇవికూడా ఉపవాచకాలుగా ఉపయోగించుకోవచ్చు.

తెలుగు - మాదిరి ప్రశ్న పత్రము

8 వ తరగతి 2 గంటలు మార్కులు

I విదురనీతి, మిత్రలాభము - ఈ పాఠము లేగ్రంథభాగములు ? వీని కవులను పేర్కొని వారే కాలపువారో తెల్పుము. 6

II (a) తాపత్రయము, జగత్త్రయము, హితత్రయము, పేర్కొనుము. 3

(b) సుహృద్గుణము లెవ్వి ? 3

(c) కాపురుష లక్షణము లెవ్వి ? 3

III (a) "......హరిభక్తివర్జితుల కేత్తవ్యర్థ సంసారముల్".

ఈ పాదముగల పద్యమును పూర్తిగ పాదభంగములేకుండ వ్రాయుము. 5

(b) "తనకు ఫలంబులేదని యెదం దలపోయడు"

ఈపద్యమునువ్రాసి భావమును తెల్పుము. ఈపద్యమునగల అలంకారమును పేర్కొనుము. 10

IV ఆముక్తమాల్యద అనగానేమి? ఆపేరెట్లు ఎవరికి కల్గెనో వివరింపుము. 6

V "మూషికము - ముని" ఈ పాఠమువలన నీవుగ్రహించు నీతులను తెల్పుము. 5

VI ఈ క్రిందివాక్యములలో మూడింటికి అర్థసందర్భములను తెల్పుము. 9

(1) 'కడుపుతీపికి వశుడైన తండ్రిగుండెలలో కొఱ్ఱుగుచ్చి కుళికెదవా ?'

(2) 'ప్రాణరక్షణ చేసికొనకుండుట పాపము'

(3) 'ధర్మములు చెప్పవచ్చునుగాని, తానునడుచుకొనుట దుష్కరముగాదా !'

(4) 'చక్రిచింతలేని జన్మంబు జన్మమే, తరళసలిల బుద్బుదంబుగాక' 9

VII వీరమసేని ప్రభుభక్తిని, పితృభక్తిని, వివరింపుము.

(లేక)

"పరులకు హానిచేయుగోరువారు తామే చెడిపోవుదురు" అనునీతిని తెల్పు కథనువ్రాయుము. 10

VIII (a) వ్యుత్పత్తులు వ్రాయుము:—గౌతమి, సౌధము, భాస్కరుడు, బిడాలము. 4

(b) రెండేసి నానార్థములిమ్ము:—కరము, గుణము, విగ్రహము, వర్షము. 4

(c) రెండేసిపర్యాయపదములు:—రాక్షసులు, విష్ణువు, యుద్ధము, సమూహము. 4

IX (a) ప్రకృతి వికృతులు వ్రాయుము:—భద్రము, వమ్ము, సత్తువ, స్నానము. 2

(b) వ్యతిరేక పదములిమ్ము:—దుర్గంధము, సార్థకము, కలిమి, సుమతి. 2

(c) సంధులవిడదీయుము:—దానవేంద్ర, ఆద్యనుష్ఠానము, విచ్చలవిడి, నేత్రోత్సాహము. 2

(d) సమాసములు పేర్కొనుము:—కమలాక్షుడు, సప్తవ్యసనములు. 2

X ఈ క్రిందివానిలో నొకదానిగూర్చి ఒక పుట వ్యాసము వ్రాయుము.

(1) గ్రంథాలయములు - పఠనమందిరములు.

(2) విద్యార్థులు - గ్రామసేవ.

(3) మీరుపాల్గొనిన భారతస్వాతంత్ర్య దినోత్సవము. 20

100

కూర్పరి : బి. పి. రామచంద్రారెడ్డి. (చదుం)

గణితము - మాదిరి ప్రశ్న పత్రము

8 వ తరగతి　　　　2 గంటలు　　　　మార్కులు

I $A:B=2:3$. $B:C=4:5$ అనుసంబంధములో **ABC** అనువారికి రు 700-లాభమును పంచిపెట్టుము. 8

II 30 మంది విద్యార్థులుగల ఒకతరగతిలో లెక్కలుసగటుమార్కులు 37·5 వీరిలో 5 మందికి వరుసగా 4,3,0,7,9 మార్కులువచ్చెను. ఈ ఐదుగురు పరీక్షకురాకుండిన ఆతరగతి సగటు మార్కులు ఎంత వచ్చియుండును ? 8

III 3 అ. 6 అం. వ్యాసార్థముగల ఒక చక్రము $\frac{1}{2}$ ఫర్లాంగు పొడవుగల చతురస్రాకారపు ఆటస్థలముచుట్టు తిరుగుటలో ఎన్నిచుట్లు తిరుగును ? 10

IV రూపాయకు $\frac{3}{4}$ శేరుబియ్య మిచ్చునపుడు ఒక కుటుంబమునకు ఒక నెలకు రు 40-0-0లు. ఖర్చగుచుండెను. రూపాయకు $1\frac{1}{4}$ శేరు యిచ్చునపు డా కుటుంబమునకు 20 రోజుల కెంతఖర్చగును ? 10

V 3′ పొడవు, $2\frac{1}{2}$′ వెడల్పు, 2′ ఎత్తుగల ఒకపెట్టెను 1″ మందముగల కొయ్యతో చేసి యున్నారు. ఆ కొయ్య ఘనపరిమాణమును కనుగొనుము. (ఘ.అ.కు సవరింపు) 10

VI రు. 25000-0-0 కేటలాగు ధరగల ఒక మోటారును ఒకడు 20% కమీషన్ పుచ్చుకొని కొనెను. వాడు తిరిగి వేరొకనికి దాని కేటలాగుధరకే అమ్మివేసిన వానికి వచ్చిన లాభ శాతమెంత ? 10

VII విషమ చతుర్భుజాకారమునగల ఒకపొలము వైశాల్యమును కనుగొనుటకు నే నాపొలములో ఒక కర్ణమును, కర్ణమున కెదుటిమూలలనుండి లంబములను, గీచితిని. వానిని కొలువగా కర్ణము 5 గొలుసులు; లంబములు 2 గొ. 25 లిం; 1 గొ 75 లిం. ఉండెను. వాని సహాయ మున ఆ పొలము వైశాల్యమును ఎకరములలో కనుగొనుము. 10

VIII 1952 సం॥ ఏప్రెల్ నెల 20 వ తారీఖున వ్రాసిన ఋణపత్రమును 20-1-1953 తేదీన లెక్క-చూడగా రు. 400-0-0 ల. అసలుకు రు. 18-12-0 వడ్డీవచ్చెను. ఆ పత్రమున వ్రాసిన వడ్డీరేటు ఎంత ? 10

IX ఒక గ్రామజనాభాలో ·55 వంతు వయోజనులును, మిగిలినవారు బాలబాలికలును గలరు. బాలబాలికల్లో $\frac{4}{9}$ భాగము చదువరులు. ఆ గ్రామములో చదువురాని బాలబాలిక లింకను 200 మంది యుండిన ఆ గ్రామజనాభా మొత్తమెంత? వయోజను లెందరు? చదువువచ్చు బాలబాలిక లెందరు ? 12

X 12 అ. ఎత్తుగల గోడకు క్రింద 9 అ. దూరమునుండి ఒక నిచ్చెన గోడ అగ్రమునకు చేర వేయబడినది. అనుకూలపరిమాణమునకు పటముగీచి ఆ నిచ్చెన పొడవును కనుగొనుము. 12

100

కూర్పరి: బి. పి. రామచంద్రారెడ్డి. (చదుం)

మాదిరి ప్రశ్నపత్రము - గ్రూపు

8 వ తరగతి] చరిత్ర [2 గంటలు

I. షేర్షాపరిపాలనా విధానమును లేక శ్రీకృష్ణదేవరాయల ఘనతను వివరింపుము ?

II. కర్ణాటకయుద్ధములందు ఆంగ్లేయుల జయమునకు కారణములను లేదా మొగలు సామ్రాజ్యపతనమునకు కారణముల పేర్కొనుము ?

III. నాల్గవ మైసూరుయుద్ధ ఫలితములేవి ?

IV. బక్సారు యుద్ధఫలితముగా ఆంగ్లేయుల కేర్పడిన అధికారములేవి ?

V. రాజ్యపరిపాలనా విషయమున బెంటింగ్ ప్రభువు ప్రవేశపెట్టిన మార్పులేవి ? లేదా రిప్పను ప్రభువు ప్రజాసౌకర్యమునకు గావించిన పనులేవి ?

VI. ఈ క్రిందివానిలో ఏవేని ఆరింటినిగూర్చి ఒకటి లేక రెండేసి వాక్యములు వ్రాయుము.

(1) పిట్టుఇండియాచట్టము (2) భూమిశిస్తువిధానము (3) సైన్యసహాయపద్ధతి (4) రాజాతోడరుమల్లు (5) మాలికాఫర్ (6) పిండారీలు (7) లాప్సుసిద్ధాంతము (8) సర్ థామస్‌రో (9) రాణిదుర్గావతి (10) సైమను కమిషను.

భూగోళము

VII. ఒకమాటలో జవాబునిమ్ము.

(a) ప్రపంచపుపైకప్పు

(b) ఐరోపాలోని అంతర్జాతీయనది

(c) ప్రపంచములో ఎక్కువ వర్షముపొందు ప్రదేశము

(d) అమెరికాలో చలన చిత్రములు తయారుచేయుటలో పేరుపొందిన పట్టణము.

(e) రాయలసీమలో క్రొత్తగా నిర్మింపబడుచున్న ప్రాజెక్టు.

VIII. ఈ క్రిందివానికి ఒకటిలేక రెండువాక్యములలో కారణములనిమ్ము.

(1) సింధుదేశము స్వల్పవర్షమును పొందుచున్నది. (2) న్యూఫౌండు లాండులో చేపలవేట ఎక్కువ (3) ఈజిప్టును నైలునదివరమందురు (4) మనదేశము వ్యాపారమున వెనుకబడియున్నది

IX. జతపరచుము.

పట్టణములు:—బ్రెజిలు, న్యూకేజిల్, నీలగిరి, జాంజిబారు, కాబూలు, షెఫీల్డు, నార్వే, విశాఖపట్టణము, జపాను, లీడ్సు.

పరిశ్రమలు:—వాసనద్రవ్యములు, కాఫీ, చేపలుపట్టుట, ఉన్నిపరిశ్రమ, మాంగనీసు, పట్టుపరిశ్రమ, కత్తులు, పండ్లతోట, సింకోనా, నౌకానిర్మాణము.

X. (a) హిందూదేశములోని మూడు ముఖ్యనదులను పేర్కొని అవి వ్యవసాయాభివృద్ధి కెట్లు ఉపయోగపడుచున్నవో తెల్పుము.

(b) ఆనకట్టు అనగానేమి ? దక్షిణ హిందూదేశమున నిర్మింపబడుచున్న మూడు ఆనకట్టలను పేర్కొని అవి ఎచ్చటెచ్చట నిర్మింపబడుచున్నవో తెల్పుము ?

సివిక్సు

XI. గ్రామపునరుద్ధరణకు ఎట్టికృషి చేయవలయును ?

XII. ప్రజలెందుకు పన్ను చెల్లించవలయును ? కేంద్రప్రభుత్వమునకు, రాష్ట్రీయ ప్రభుత్వములకు, చేరు రెండేసిపన్నులను పేర్కొనుము.

XIII. సంఘమున మానవుని విజ్ఞానాభివృద్ధికి తోడ్పడు వివిధాంశములను పేర్కొని అందొక దానినిగూర్చి వ్రాయుము.

XIV. "ప్రజల ఆరోగ్యమునకు ప్రతిమానవుడు బాధ్యుడే"—ఎట్లు ?

XV. "వార్ధా విద్యావిధానము నేటి మనదేశఆర్థిక దుస్థితిని కొంతవరకు తొలగింపగలదు"-వివరింపుము.

యన్. శ్రీనివాసాచారి, టీచరు-తిరుపతి.

చరిత్రాంశములు

శ్రీ యన్. శ్రీనివాసాచారి - టీచరు - తిరుపతి

ఈ క్రిందివానినిగూర్చి క్లుప్తముగ వ్రాయుము.

1. గజినీ :—మనదేశమందలి అగణిత ధనరాసులను దోచుకొను నుద్దేశముతో దండయాత్రలు సలిపెను. కొల్లగొట్టిన ధనముతో గజినీపట్టణము నలంకరించెను. విగ్రహనాశకుడని పిలువబడెను. సోమనాథ దేవాలయపు ముట్టడి ముఖ్యము.

2. కుతుబుద్దీన్ :—ఘోరీమహమ్మదు బానిస. ఢిల్లీ నేలిన మొదటి సుల్తాను. ఇతని జ్ఞాపకార్థము ఢిల్లీయందు కుతుబ్ మీనార్ అను కట్టడము కట్టబడియున్నది.

3. బాల్బను :—బానిసరాజులలో గొప్పవాడు. మంగోలియనుల దండయాత్ర నాపుటకు వాయవ్య సరిహద్దున కోటలు కట్టి సైన్యముతో నింపెను. కవులను, పండితులను పోషించెను.

4. అల్లాయుద్దీనుఖిల్జీ:—ఖిల్జీవంశపురాజులలో గొప్పవాడు. మాలిక్‌కాఫర్ అను సేనాని సహాయమున దేవగిరి, ద్వారసముద్రము, ఓరుగల్లు, మధురజిల్లాలను, జయించెను. మంచి పరిపాలనను నెలకొల్పి ఆహారపదార్థములపై కంట్రోలుధరలను నిర్ణయించెను.

5. మహమ్మదుబీన్‌తుగ్లక్ :—ప్రజలు ఇతని తెలివితేటల నర్థముచేసుకొనలేక ఇతనిని పిచ్చితుగ్లక్ అనిరి. మహమ్మదీయ మతపిచ్చికలవాడు. హిందువులను హింసించెను.

6. బహామనిరాజ్యము:—క్రీ. శ. 1347లో అల్లాయుద్దీన్ హాసన్ గంగూ, బహమనీ రాజ్యమును స్థాపించెను. దీనికి గుల్బర్గా రాజధాని. తుదకు వీరి కలహమువలన రాజ్యము విచ్ఛిన్నమై (1) బీజపూరు (2) అహమ్మదునగరము (3) గోల్కొండ (4) బీరారు (5) బీదరు అను 5 భాగములుగ చీలెను.

7. విజయనగర సామ్రాజ్యము :—హరిహరబుక్కరాయలు అనువారు క్రీ. శ. 1336 లో విజయనగర సామ్రాజ్యమును స్థాపించిరి. ఆనెగొంది లేక బళ్లారిలోని ప్రస్తుతపు హంపి దీనికి రాజధాని. దీనిని సంగమ, సాళువ, తుళువవంశస్థులు పరిపాలించిరి.

8. శ్రీకృష్ణదేవరాయలు :—తుళువవంశపు రాజులలో గొప్పవాడు. విశాలసామ్రాజ్యమును చక్కగ పరిపాలించెను. బీజపూరు సుల్తాను నోడించి రాయచూరుజయించెను. స్వయముగ కవి. ఆముక్తమాల్యద అను ప్రబంధమును రచించెను. అష్టదిగ్గజములను కవులు ఆస్థానము నలంకరించిరి. వ్యవసాయమునకై చెరువులు, కాలువలు, త్రవ్వించెను. పోర్చుగీసువారి స్నేహముచేసి వ్యాపారము అభివృద్ధిపరచెను.

9. గురునానక్:—సిక్కుమతస్థాపకుడు. హిందూముస్లిం సమైక్యతకు కృషిసల్పి నూతనమతమును స్థాపించెను.

10. షర్షా:—హుమాయూనును చౌసా, కనోజ్ యుద్ధములందు ఓడించి ఢిల్లీసింహాసనమెక్కెను. భూములను సర్వేచేయించి ఆదాయమున నాల్గవవంతును ధన, ధాన్యరూపముగ శిస్తుతీసుకొనునట్లు నిర్ణయించెను. గుర్రములమీద తపాలాపద్ధతిని మొదట ప్రవేశపెట్టెను.

11. అక్బరు:—మొగలులలో గొప్ప చక్రవర్తి. సామ్రాజ్యము విశాలమైనదగుటచే పరగణాలుగను, సుభాలుగను, విభజించి ఒక్కొక్కదానిపై ప్రత్యేక పరిపాలనాధికారుల నియమించెను. తోడరుమల్లు సహాయమున భూమిశిస్తును సవరించెను. హిందువులను, రాజపుత్రులను, ఆదరించి వివాహసంబంధములు కావించుకొనువారికి ఉన్నతఉద్యోగముల నిచ్చెను. హిందువులపైనున్న జిజియా పన్నును రద్దుపరచెను.

12. జహాంగీరు:—అక్బరు కుమారుడు. ఇతని కాలమున మొగలుసామ్రాజ్య మత్యున్నతదశయందుండెను. తన భార్యయగు నూర్జహానునకు రాజ్యభారమప్పగించి భోగపరాయణుడైయుండెను. ఇతని కాలమున విలియంహాకిన్సు, సర్ థామసరో అను ఆంగ్లేయులు తూర్పుఇండియా వర్తక సంఘమునకు ఉత్తర్వు బడయుటకు రాయబారులుగా వచ్చి ఇతనిని దర్శించిరి.

13. షాజహాను :—ఇతని కాలమున అనేక నూతనమసీదులు కట్టబడెను. అందు ఢిల్లీలోని జుమ్మామసీదు, ఆగ్రాలోని మోతీమసీదు, ముఖ్యమైనవి. తనభార్య ముంతాజ్ జ్ఞాపకార్థము యమునానదీ తీరమున చలువరాతితో టాజ్‌మహలుఅను దివ్యభవనముకట్టెను. కోట్లకొలదిరూపాయలు వెచ్చించి నెమలిసింహాసనము తయారుచేయించెను.

14. ఔరంగజేబు :—మహమ్మదీయ మతమందెక్కువ పిచ్చికలవాడు. పరమతద్వేషి. హిందువులపై జిజియా, యాత్రపన్నులను విధించి ఎక్కువగహింసించెను. రాజపుత్రులకువిరోధియయ్యెను. మహమ్మదీయ మతగ్రంథమగు ఖురానులో చెప్పబడినట్లు నడుచుకొనువాడు. మొగలుసామ్రాజ్య పతనమునకు కొంతవరకు యీతడు కారకుడయ్యెను.

15. శివాజి :—క్రీ. శ. 1627 షాజీబాన్‌స్లేకును, జిజిబాయికిని, పుట్టెను. తల్లియు, గురువగు దాదాజీ ఖాండదేవ్ బోధనలవలన గొప్ప యుద్ధవీరుడయ్యెను. బీజపూరు సుల్తానుచే పంపబడిన అఫ్‌జల్‌ఖానును, ఔరంజేబుచే పంపబడిన షైస్తఖానును ఓడించి చంపెను. క్రీ. శ. 1674 రాయగడమున పట్టాభిషిక్తుడయెను.

16. క్లైవు:—తూర్పుఇండియా వర్తకసంఘమున నౌకరుగానుండి పిదప సేనానాయకుడయ్యెను. దక్షిణ హిందూదేశమున జరిగిన కర్ణాటకయుద్ధములందు జయముసంపాదించి దానితో తృప్తినొందక ప్లాసీ, బక్సారుయుద్ధములందు గెలుపొంది తూర్పుఇండియా వర్తకసంఘము పలుకుబడిని వృద్ధిచేసెను. ఆంగ్ల సామ్రాజ్యస్థాపనకు మంచి పునాదివేసెను. బంగాళమున ద్వంద్వప్రభుత్వము నేర్పరచెను. ఆర్కాటు వీరుడని బిరుదుపొందెను.

17. వారన్‌హేస్టింగ్సు:—మొదటి ఆంగ్లగవర్నరుజనరలు. ద్వంద్వప్రభుత్వమును తొలగించి, బోర్డుఆఫ్ రివిన్యూను (Board of Revenue) స్థాపించెను. నేరములను విచారించుటకు సివిల్ క్రిమినల్ కోర్టులను స్థాపించెను. క్లైవుచే స్థాపింపబడిన ఆంగ్లసామ్రాజ్యమును సుస్థిరముచేసెను.

18. కారన్‌వాలీసు:—బంగాళము, బీహారులందు శాశ్వతభూమి శిస్తువిధానమును ప్రవేశపెట్టెను. ఇందువలన జమీందారు రైతుల వద్దనుండి వసూలుచేసి ప్రభుత్వమునకు చెల్లింపవలసినపన్ను స్థిరమయ్యెను. మైసూరు సుల్తానగు టిప్పును మూడవ మైసూరు యుద్ధమున ఓడించి 1792 శ్రీరంగపట్టణము సంధికావించుకొనెను. ఆసంధిప్రకారము మలబారు, కొడగు, సేలం, కోయంబత్తూరు, ఆంగ్లరాజ్యమున కలిపెను.

19. వెల్లస్లీ:—సైన్యసహాయపద్ధతిని ప్రవేశపెట్టి ఆంగ్లేయుల పలుకుబడిని ఎక్కువచేసెను. స్వదేశ రాజులు దీనికి అంగీకరించి అంగ్లేయులకు సైన్యములరక్షణనిమిత్తము కొంతరాజ్యమిచ్చుటచే రాజ్యవిస్తీర్ణ మెక్కువయ్యెను. దీనికిలోబడినవారు ఆంగ్లేయుల అనుమతిలేక బయట వ్యవహారములందు జోక్యముకలిగించుకొనరాదు. యుద్ధములుగాని సంధిగాని, సల్పరాదు. నైజాము, అయోధ్యనవాబు మొదట దీనిని అంగీకరించిరి. ఇతని కాలమున ఆంగ్లసామ్రాజ్యము అయోధ్య మొదలు కన్యాకుమారి వరకును, తీరభూములందును, వ్యాపించియుండెను. చెన్నరాజధానిని పూర్తిచేసెను.

20. లార్డుహేస్టింగ్సు:—1817 లో సింగపూరును వశపరచుకొనెను. అందువలన చైనా, జపాను మొదలగు ప్రాగ్దేశములతో వర్తకమువృద్ధిచెందెను. నేపాళయుద్ధమున జయించి సిమ్లా, నైనిటాలు, ముస్సోరి, ఆల్మోరాలను ఆంగ్లసామ్రాజ్యమున కలిపెను, పిండారీలనణచి ప్రజలను రక్షించెను.

21. విలియంబెంటింగు:—యుద్ధములుచేయక శాంతితో రాజ్యము నేలెను. ధగ్గులను దోపిడిగాండ్ర నణచెను. జాతిమతభేదము లేక ఉన్నతోద్యోగముల భారతీయులకు నిచ్చెను. మెకాలే సహాయమున ఆంగ్లవిద్యను ప్రవేశపెట్టెను. సంఘసంస్కర్తయగు రాజారామమోహనరాయల సహాయమున సతీసహగమనము, నరబలులను దురాచారములనుమాన్పించెను. మద్రాసు, ఆగ్రాలో రైతులిచ్చుపన్నులనిర్ణయించెను. దీనికి రైత్వారీపద్ధతి యని పేరు.

22. రంజితసింగు;—1800 లో పంజాబు చీలిపోయి పండ్రెండు సర్దారులు పాలించుచుండిరి. వీరు అంతఃకలహములను కలిగియుండుటచే సిక్కులబలము తగ్గెను. సర్దారులలో నొకడగు రంజితసింగ్ ఆఫ్ఘనిస్థానపువాడైన అహమ్మద్‌షా అబ్దాలీవిడిచిపెట్టి వెళ్లినఫిరంగులను అబ్దాలీకి పంపి లాహోరు గవర్నరయ్యెను. రాజ్యమును సింధునదినుండి సట్లెజ్ నదివరకు వ్యాపించెను. ఆంగ్లేయులతో 1809 లో అమృత

సరస్సు సంధిగావించుకొనెను. ఆఫ్ఘనుల వలనగాని, మహారాష్ట్రులవలనగాని. భయములేకుండా ప్రజలను రక్షించి పరాక్రమవంతుడు, ధైర్యశాలి, న్యాయవర్తనుడని మెప్పుబడసెను. ఇతనికి పంజాబు సింహము' అని పేరు.

23. డల్హౌసీ:—లాప్సుసిద్ధాంతమును ప్రవేశపెట్టి పుత్రసంతానము లేని స్వదేశసంస్థానములను ఆంగ్ల రాజ్యమున కలిపెను. దీని ప్రకారము సతార, ఝాన్సీ, నాగపూర్, ఉదయపురము, జైత్పురము భగవత్, అను రాజ్యముల నాంగ్లసామ్రాజ్యమున కలిపెను. ప్రజోపయోగశాఖను స్థాపించెను. తంతితపాలాపద్ధతిని ప్రవేశపెట్టెను, మొట్టమొదట 1853 బొంబాయినుండి థానావరకు రైలుమార్గము వేసెను. కలకత్తా, బొంబాయి, రంగూనులందు నౌకాశ్రయముల బాగుచేయించెను.

24. సిపాయిల కలహము:—డల్హౌసీప్రవేశపెట్టిన లాప్సుసిద్ధాంతమును రాజకీయకారణముగా తీసుకొనియు, విలియంబెంటింగు సతీసహగమనము మాన్పినందువలనను, ఆంగ్లవిద్యను ప్రవేశపెట్టినందువలనను, డల్హౌసీప్రవేశపెట్టిన తంతితపాల పద్ధతియు, రైలుమార్గమున, సిపాయిలందు హైందవనాగరికతను నాశనముచేయుచున్నదను భీతికలిగెను. అందుకుతోడు అప్పటితోటాలు ముఖ్యకారణమయ్యెను. వీరి కలహము 1857 లో ప్రారంభింపబడి తుదకు ఓడింపబడిరి. 1858 లో విక్టోరియా మహారాణి అభయ పత్రమును ప్రకటించి సిపాయిలను చేరదీసి వారికి తృప్తికలిగించెను.

25. కానింగు:—దత్తతనిరసనాధికార శాసనమును రద్దుచేసెను. రాజప్రతినిధికిని, గవర్నరులకును, సలహా నిచ్చుటకు 1861 లో మొదటిసారి శాసనసభలను స్థాపించెను. సిపాయిల కలహము నణచెను.

26. రిప్పను:— 1882 లో స్థానిక స్వపరిపాలనా సంస్థలస్థాపించెను. ఈసంఘములకు అధ్యక్షులు సభ్యులచే ఎన్నుకొనబడుదురు. ఇల్బర్టుచట్టమును ప్రవేశపెట్టి యిరోపియనులను కూడా హిందూన్యాయాధిపతులువిచారించు నవకాశము కల్పించెను. ఫాక్టరీచట్టమును ప్రవేశపెట్టి 12 ఏండ్లలోపు పిల్లలు పని చేయుకాలము నిర్ణయించెను. వార్తాపత్రికలకు సంపూర్ణస్వాతంత్ర్యమివ్వబడెను.

27. కర్జను:—రైతులకు ఎక్కువ హాయిదాలకు తక్కువ వడ్డీలకు అప్పుదొరకు సహకారసంఘములను స్థాపించెను. పాడుపడయున్న చరిత్రాత్మక కట్టడములను పునరుద్ధరించుటకు "ఆర్కిలాజికల్" సంస్థను స్థాపించెను. బంగాళమును విభజించెను. విద్యను పోషించుటకై యూనివర్సిటీ చట్టమును తయారు చేసెను.

28. మింటోమార్లీసంస్కరణములు:—మింటోరాజ ప్రతినిధిగను, మార్లీఇండియామంత్రిగను, నుండినప్పుడు జరిగిన సంస్కరణములు అగుటచే మింటోమార్లీసంస్కరణములని పేరువచ్చెను. ఇది 1909 లో గావింపబడెను. (1) కేంద్రరాష్ట్రశాసన సభలందలి సభ్యుల సంఖ్య హెచ్చింపబడెను. (2) కేంద్రరాష్ట్రశాసన సభలందు అనధికార సభ్యులు ఎక్కువ చేయబడిరి. రాజప్రతినిధి, గవర్నర్ల సలహాసంఘములందు భారతీయులకు స్థానమివ్వబడెను.

పంతులయ్య

రచన : 'చిరంజీవి'

స్వాతి వానకొరకు సంద్రాన ముత్యపుఁ
జిప్పపగిది నీదు జీతమునకు
నెదురుఁజూచు చుందు వెప్పటి కప్పుడే
ప్రథిత సుగుణధుర్య పంతులయ్య!
ఎంత వేడుకొన్న నే దేవుఁ గొల్చిన
నుంత ఫలములేని వింత బ్రతుకు
బ్రతుకు చున్నయట్టి పరమనిర్భాగ్యుఁడ
ప్రథిత సుగుణధుర్య! పంతులయ్య!
డొక్కశుద్ధిలేని దొరలెల్ల నీమీద
పెత్తనంబు నూపు పెద్దలు గద!
కాలమహిమ నేమిగా నెంచినావయ్య!
ప్రథిత సుగుణధుర్య! పంతులయ్య!
అతని పొట్టఁగోయ నక్కర యొక్కటి
యైనఁ గానఁ బడదు గాని నీవు
చెప్ప చదువులోన దప్పుల వెదకును
ప్రథిత సుగుణధుర్య! పంతులయ్య!
తమదు మేలు మదిని దలపోసి వేనోళ్ళ
పొగడి నీదు సేవ పొందుచుంద్రు
బ్రతుకుబరువు తీరు గతిఁ జూప రెవ్వరు
ప్రథిత సుగుణధుర్య! పంతులయ్య!
వినర నేటిజగతిఁ బెక్కురు ఏరును
తెప్పమీద దాటి తీరమునను
గాలుమోపి దానిఁ గాల్చెడి బుద్ధులు
ప్రథిత సుగుణధుర్య! పంతులయ్య!
మగని మొట్టువెట్టి మొగసాల నెక్కిన
పగిది నిన్ను హీనపఱచి పయిగ
నింద సేయుచుంద్రు నీచపుబుద్ధులు
ప్రథిత సుగుణధుర్య! పంతులయ్య!
చదువుచుంద్రు గురుఁడు సాక్షాత్తుమూర్తిత్రి
యాపరావతార మంచు దరచు
పిలుచుచుంద్రు వింతపేరుల కొంటెగా
ప్రథిత సుగుణధుర్య! పంతులయ్య!

పదవి నంది నాల్గుపైసాల గడియించి
నంత సార్ధ్వదృష్టి నందు నరుఁడు
కనఁడు దీనికెల్ల కారణుఁ డెవ్వఁడో
ప్రథిత సుగుణధుర్య! పంతులయ్య!
నీదుకథల వించు నీకష్టములఁ గంచు
జగతి కంటి నీరు చాల నించు
వగపు మిగులఁ బెంచు నగుబాట్లలో ముంచు
ప్రథిత సుగుణధుర్య! పంతులయ్య!
నీదు కంటినీట నిండిన కాలువఁ
జగతిఁ బండుచుండు సౌఖ్యరాశి
వగ పదేల నీవ బహు ధన్యజీవివి!
ప్రథిత సుగుణధుర్య! పంతులయ్య!
కనుల నీరుగార్చి కాయంబు కృశియించి
బడుగు వొటవలన ఫలము లేదు
ధైర్యమంది నీదు ధర్మము నెరవేర్చు
ప్రథిత సుగుణధుర్య! పంతులయ్య!

* నా దేశం *

శ్రీ ఘండికోట నరసింహమూర్తి—టీచరు

1. నా దేశం నా దేశం
స్వతంత్ర భారత దేశం
కవులకు కళలకు
గాయక వరులకు
వీరులు శూరులు
వివిధ జాతులకు
నీతివేత్తలకు
నిగమసూక్తులకు
సకల శాస్త్రములకు
సత్యసంధులకు
జన్మభూమిరా నా దేశం
కర్మభూమిరా నా దేశం॥

2. పొంగులు వారెడి జీవనదులతో
క్రిందికి దూకే సెలయేఋలతో
పచ్చని పొలముల పైడిపంటతో
తీయని ఫలముల తేటరసముతో
కులుకులాడురా నా దేశం
పలుకరించురా నా దేశం॥

3. కులమతముల గొడవలు మాని
అన్ని తెగలకూ ఆశ్రయమిచ్చి
ఆదరించురా నా దేశం
అన్నమిడునురా నా దేశం॥

4. అట్టిదేశమున పుట్టినబిడ్డా!
అక్షరాల నీ దేశనియమముల
ఎక్కడఉంటే అక్కడనీవు
ఆదరించవలెరా—తప్పక
అనుసరింపవలెరా॥

—: ప్రాథమికవిద్యా ప్రచారగీతము :—

(పేదరైతులో నేపథ్యగీతము "పొలమునీదనుకోని" వరుస)

భావి భారతబాల-వీరుడవు నీవని
వ్యర్థముగ తిరుగక-బడికి రావోయీ
ఓ భావిబాల ॥భావి॥
నీ తెలివితేటలకు-జగమెల్ల వెలుగులై
పూజ్య భారత-జనని-చాటవలె సుమ్మీ
నీదు మానవజన్మ-నీటిపాలేనా?
ముందునకు రావా? ॥భావి॥
ఇంటిలో మెలమెల్ల అడుగులేశావు
భరతవీరుడ నంచు-గంతు లేశావు
నీవు తెచ్చినపలక-నీవు వ్రాసిన వ్రాత
నీవు చదివినచదువు-కాదు పొమ్మంటారా?
నడుముగట్టుచు నీవు-ముందు రావేరా?
బాల యాలోచ నేలా? ॥భావి॥
నీచదువు బడిలోన-నీతు లెన్నోగలవు
పూజ్యగురు లిడు విద్య-మీవారిబలము
ఒరవళ్ళు దిద్దావు-నేర్చావు శిల్పి
చాటేవు మీవారి-తేజంబు నెల్ల
బడిలోకి రావోయి-భావి భారతబాల
మనసార బడిలోన-చదువు నేర్వాలి!
వేగ బడికి రావాలి ॥భావి॥
ఈనాటి చదువుతో-పౌరుండ వౌతావు
భావిపౌరుడ దేశ-నాయకుడ వౌతావు
ప్రాథమిక చదువెంత-ప్రాధాన్యమోయీ
ఆలసింపక నీవు-బడికి రావాలి!
విద్య నేర్వాలి ॥భావి॥

—పల్లస్వామినాయుడు,
టీచరు మేనేజరు - గొలుగువలస.

---

* * బడిపంతులు బ్రతుకు * *

మానెం లింగరాజు, టీచరు, పిల్లెంబాడి – టిటాఘర్.

వేసవి శెలవులయినతరువాత ఆరోజునే బడి తెరిచాను. శెలవుల్లో అక్కడక్కడకు పోయినందు చేతనేమో ఆ రోజు పిల్లలు చాలాతక్కువగా వచ్చారు. హటాత్తుగా వచ్చాడు యిన్‌స్పెక్టరు స్కూలు తనిఖీకి. గుండెలో పెద్దబండ పడ్డట్టయింది. వచ్చీ రావడమే "ఏమండీ యిదేనా పిల్లలసంఖ్య" అన్నారు. వేసవి శెలవులతరువాత యీ వేళే బడి తెరిచాముగాన ఎవ్వరూ రాలేదన్నాన్. ఇలాంటి సాకులుచెప్పితే పనికిరావండీ నీస్కూలు ఎత్తించేస్తానన్నారు. నాకే ఆధారంలేదండీ, కటాక్షించాలన్నాను. గవర్నమెంటుకళ్ళలో దుమ్ముకొట్టి మీకు గ్రాంటు ఇప్పించమన్నారా? అలా వల్లకాదని యింకేమేమో కఠిన వాక్యాలు పలికారు. వెనుకనున్న బంట్రోతుకాబోలు! ఏమయ్యా! బాబుగారికి భోజనానికి ఏర్పాటు చేయించవయ్యా! అన్నాడు? అలాగేనని యింటికిపోయి, ఆరోజున వండినవంటను దంపతులిరువురమూ వస్తుండి ఆ భోజనాన్ని యిన్‌స్పెక్టరుగారికి, బంట్రోతుకు, పంపించాను. భోజనం అయినతరువాత యిన్‌స్పెక్టరు నన్నుపిలిచి "చూడండీ! మాష్టరుగారూ! మీ వూరులో మంచినేయి దొరుకుతుందేమో ఒక శేరు పట్టుకురండి! సొమ్మిస్తాను" అన్నారు. "చిత్తం. యీ భాగ్యానికి తమరు సొమ్మియివ్వాలా" అంటూనే నేయికోసంబయలుదేరాను. "మావూరిలో మంచినేయి దొరుకుతుందని యీయనకలగన్నాడా? సొమ్ము యిస్తానంటాడు? గాని కొనికూడా యిచ్చేదిలేదు. యిదే గౌరవమైన వారిముష్టి, అదే చిన్నవాడు చేస్తే "లంచం" అని, "చులకనబుద్ధి" అని యింకేమేమో పేర్లు పెడుతారు. అనుకుంటూ నేయికోసం గాలించి ఒక శేరు అరువు పట్టుకొనివచ్చాను. ఆరోజుతో పీడవదలుతుందనుకొని, ఆ నేయిని యిన్‌స్పెక్టరు గారిచేతి కందిస్తూ "తమరు కటాక్షించాలి. దయదలచాలి" అంటూ దీనంగా ప్రార్థించాను. "సరేలే చూద్దాం. వచ్చేవార మొకసారి ఆఫీసుకువచ్చి కలుసుకో. చూడవోయ్ పంతులూ! వచ్చేవారం వచ్చేటప్పుడు మంచివి, తాజాకూరగాయలు ఏమైనాదొరికితే పట్టుకురా? నేను ఆసొమ్ము అక్కడే యిచ్చేవేస్తా" నంటూ బయలుదేరగానే వెనుకనున్న బంట్రోతు చేయిజాపాడు – నా బహుమతి ఏదన్నట్లు. సోమవారమునాడు నీకేమైనా మాట్లజెప్పుతానులే. యిన్‌స్పెక్టరుగారితో నీవూ నాలుగుమాటలు చెప్పుమనగానే, "ఓ! నేనుండగా నీకేం భయమయ్యా! యిన్‌స్పెక్టరు నే నెలాచెపితే అలాగేవింటాడు. కాని నాదే బకాయిపెట్టారు" అంటూ యిన్‌స్పెక్టరు వెనుక బయలుదేరాడు.

వెధవబంట్రోతు! యిన్‌స్పెక్టరు వాడి చేతిలోనివాడట! కానీ భగవంతుడే వున్నాడు. నేయి బాకీతీర్చాలి. కూరగాయలు కొనాలి – అన్న దిగులుతో యింటికిపోకుండా బడిలోనే బల్లపై కూర్చున్నాను. యింతలోనే వీధిలోనుంచి పిలుపు నా పేరుతో వినబడింది. మళ్ళీ ఏ ఆఫీసరో వచ్చాడనుకొని ప్రాణాలు నిలువునా ఎగిరిపోయాయి. యీ వెధమబాధలు పడేదానికన్నా యీ వుద్యోగానికి స్వస్తి చెప్పితే బాగుండుననుకున్నాను గాని నిరుద్యోగసమస్య తలంచుకుంటే భయంవేసింది. మళ్ళా బైటనుండి "ఎవరయ్యా లింగరాజుమాష్టరు" అనగానే నేనేనంటూ బయటికి వచ్చాను. ఆ పిలిచేవ్యక్తి నావైపు ఎగాదిగా చూడగానే, వీడికేమైనా దయ్యం పట్టలేదుగదా అనుకొన్నాను. "నీకు కోర్టుసమనుంది. సోమవారము వాయిదా" అనగానే నాగుండె బేజారెత్తి ఏమిటా సమననిచూస్తే ఎల్లయ్య షావుకారికి నూరు రూపాయలు బాకీవున్నందుకు కేసు(దావా)పెట్టినట్లు తెలుసుకున్నాను. నోటీసు అందుకున్నా బంట్రోతు కదలక నా మామూలుఏదీ అన్న ప్రశ్నార్థంగా చేయిజాపాడు. కోర్టుకు వెళ్ళిన ప్రతీ మనిషికీ సమను జారీ చేసిన బంట్రోతుకు ప్రథమలంచం కాబోలు ననుకున్నాను. అటుబోయి ప్లీడరుఫీజులు, ప్లీడరుగుమాస్తాల మామూళ్ళు, ఆఫీసుఖర్చులు, ఆఖరుకు కోర్టుగోడలకు నిల్చున్నందుకు అవీకూడా తమమామూళ్ళని అడుగుతారేమో. ఆహా ఏమి ప్రపంచము! అడుగుతీసి అడుగుపెడితే లంచమేకదా! అనుకొని నీ మామూలు సోమవారం యిస్తానని అతనిని సాగనంపి, యింటికి చేరుకొన్నాను. సోమవారము వుదయమే ఏవో చినిగిన

దుస్తులతో స్కూలు రికార్డంతా ఒకసంచిలో పెట్టి బయలుదేరి, ఆఫీసుకు వెళ్ళాను. ఆఫీసుపని ముగించుకొని కోర్టుకు చేరాను. మరికొంతసేపటికి నా పేరుతో బంట్రోతు పిలువగా హాలులోనికి వెళ్ళబోతుంటే ఆ బంట్రోతే అడ్డగించి "ఎవరునువ్వు" అన్నాడు, నువ్వుపిలిచిన లింగరాజు నేనే నన్నాను. అనగానే నఖశిఖపర్యంతమూచూసి, "అయితే నీవు, బడిపంతులుహా" అని అడిగాడు. అవుననగానే వెళ్ళమని అనుజ్ఞయిచ్చాడు.

కోర్టులో వాయిదాపడింది. నేను బడిపంతులనని బంట్రోతు ఎలా తెలుసుకున్నాడు? నాముఖం మీద ఏమీ రాసిలేదే? వీడికేమైనా బ్రహ్మలిపి తెలుసునేమోయన్న ఆలోచనలతో నడకసాగించాను. పంతులుబ్రతుకు బంట్రోతుకుకూడా హేళనగా వున్నదనుకుంటూ, రోడ్డుపైనుండి పోతుంటే, ఏయ్ పంతులూ: రోడ్డుప్రక్కనుండి పోవయ్యా! "అన్నపోలీసువానికేక వినిపించింది. నేను వెంటనే రోడ్డుదిగి పోలీసువానియొద్దకు వెళ్ళి "అయ్యా! చిన్నసందేహం. నేనుబడిపంతులనని తెమకెలా తెలిసిం"దని అడిగాను, నీవు పంతులవని నీ ఆకారమే చెప్తుంది. ఆ చినిగినచొక్కా, దానిని కప్పుటకొక పాతకోటు, ఒకప్రక్క త్రాడుకట్టిన కళ్ళద్దాలు, ఆ జల్లెడలాగున్న గొడుగు, చూస్తే యిలాంటి దీనావస్థ బడిపంతులుకుగాక యింకెవరి కుంటుందని గ్రహించానని చెప్పాడు. లోకంలో ప్రతివానికి అధికారవాంఛ ప్రబలింది. ప్రతి మానవునకు ధనాపేక్షేగాని తృప్తిఅనేది లేదు. పెద్దజీతగాడు కొనికి గూడా కక్కుర్తే. నిరాడంబరజీవి ఒక్కమాష్టరే. తనకు వచ్చినదానితో తృప్తిపడేది మాష్టరే. కాని ఆతన్నిగురించి తప్పత్రోవలు త్రొక్కుతున్న దీ లోకము. లోకంలో మాష్టరుకు తగినస్థానం ఏది? అక్షరజ్ఞానం యిచ్చేవాడు ప్రైమరీస్కూళ్ళ మాష్టరేకదా! మాష్టర్లయొక్క దుర్భరజీవితంలో కష్టనష్టాలు తెలుసుకొనేదెవరు? మాష్టర్లబ్రతుకంత హీనమా? స్కూలుఫైనలువరకూ చదివి, మరి రెండేండ్లు ట్రయినింగ్ అయినందుకు మాష్టరుకు శిక్ష ఏమిటంటే ఆ జన్మాంతమూ దారిద్ర్యము అనుభవించడమే. ఇదే మాష్టరుజీవితం, మాష్టరుజీవితంలోని తియ్యని తలంపులన్నీ మనస్సులో మణిగిపోవలసిందేనా? ఛీ. ఛీ. ఆలుబిడ్డల పోషింపలేక, తను సుఖపడలేని యీ శూన్యమైన మాష్టరుజీవితంకంటె ఒక బంట్రోతువాని జీవితమే మేలు అనుకుంటూ యిల్లు చేరుకున్నాను.

ప్రాథమికోపాధ్యాయ యూనియనులు-రికగ్నిషన్లు.

ఇప్పటివరకు ఎయిడెడ్, బోర్డు, మునిసిపల్, టీచర్లు వారివారి ప్రత్యేకయూనియనులను తాలూకా వారీగా స్థాపించుకొని, గవర్నమెంటు రికగ్నిషను పొందిపనిచేయుచూ వస్తున్నారు, మీరుజిల్లా, రాష్ట్ర సంఘాలను స్థాపించుకొనుటకు అవకాశము కలిగించవలెనని చేసిన ఆందోళనవల్లనైతే నేమి, ఇతర సంఘాల వారు ప్రతివ్యక్తికి సంఘస్వాతంత్ర్యముండాలని నడపిన కార్యక్రమాలవల్లనైతే నేమి, నూతన రాజ్యాంగ చట్టంలోని రూల్సు ననుసరించి ప్రతివ్యక్తికి సంఘ స్వాతంత్ర్యం సిద్ధించింది. ఇందుపై మన ప్రభుత్వం వారు లోగడ ఉపాధ్యాయ సంఘాలకు సంబంధించిన జి. ఓ. లను రద్దుచేస్తూ ఉపాధ్యాయ సంఘాలకు రికగ్నిషన్ అవుసరం లేదనీ, వారు వారికి నచ్చిన సంఘాలను నడుపుకోవచ్చుననీ, ప్రకటించినారు.

ఇందుపై కొందరు స్వార్థపరులు లోగడ రికగ్నయిజు కాబడిన మేనేజిమెంటువారీ యూనియనులు రద్దయి పోయినవనీ, ఉపాధ్యాయులకు సేవచేయుటకై తమ సంఘయొకటే నిలచియున్నదనీ, ఆ మేనేజిమెంటువారీ యూనియనులలోని నిల్వఫండును, రికార్డును, తమ సంఘానికే అప్పజెప్పవలెననీ, రకరకాలుగా ప్రకటన చేయుచున్నారు.

ఈ ప్రకటన లోగడ రికగ్నియిజు యూనియనులయందు భక్తి విశ్వాసములు కలవారిని పెక్కుమందిని చీకాకుపరచుచూ, ఉపాధ్యాయులలో అనైక్యతకు దారితీయుచున్నది. ఈసందర్భములో మేము ఉపాధ్యాయలోకానికి తెలియజేయునదేమనగా ఇప్పుడు మనకు సంఘస్వాతంత్ర్యం సిద్ధించింది. ఇకమనకు నచ్చిన సంఘాలను మనం నడుపుకోవచ్చును. మనసంఘాలకు ప్రభుత్వ రికగ్నిషన్ యికపై అవుసరంలేదు.

దీనినిబట్టి లోగడ యిచ్చిన రికగ్నిషన్‌లను ప్రభుత్వం వారిపుడు తీసివేసుకొన్నారు. దీనినిబట్టి చిరకాలము నుండి ఉపాధ్యాయులకు సేవచేయుచున్న మేనేజిమెంటువారీ యూనియన్లు రద్దయిపోయినవని చెప్పువారి మాటలు వట్టి బూటకములని స్పష్టమగుచున్నది.

ఒక్కొక్క మేనేజిమెంటులోని టీచర్లకు ఒక్కొక్కరకమైన యిబ్బందులుండుటచే వారివారి ప్రత్యేక సమస్యలను వారి ప్రత్యేక సంఘాలద్వారా నెరవేర్చుకొనుట సులభమార్గము. అంతేకాని యీ టీచర్లంతా కలసి ఐక్యసంఘాలంటూ పెట్టుకోవడం తీర్థానికి తీర్థం-ప్రసాదానికీ ప్రసాదం" లాగున వుంటుంది. ఇది ఎన్నటికిని ఐక్యత అనిపించుకొనదు. కాన ఉపాధ్యాయ సోదరులెల్లరు లోగడనుండి టీచర్లకు సేవచేయుచున్న తమ తమ మేనేజిమెంటువారీ తాలూకా యూనియన్‌లను బలపరచుకొని, వాటి పునాదులపై జిల్లా రాష్ట్ర సంఘాలస్థాపనకై పూనుకొనవలసినదని హెచ్చరించుచున్నాము.

గుంటూరు,
12—12—52.

వై. ఐ. జయ్యా, ప్రెసిడెంటు,
గుంటూరు తాలూకా ఎయిడెడ్ ఎలిమెంటరీస్కూలు, టీచర్ల యూనియన్.

వివేక ప్రశ్నలు

అక్కరములు నాల్గు – ఒక్క 'నదికి' పేరు;
ఆపదంబె'భాష' – కర్థమగును ;
మొదలుతుదలుగలిపి,చదువంగ 'సతి'యగు;
రెండునాల్గు మదను – లేమ యగును.

శ్రీ కాసులనాటి హనుమచ్ఛాస్త్రి,
టీచరు – గంగవరం.

ఒక్కపురము పేరొప్పు నాల్గక్కరముల ;
ఆది రెండక్కరంబులు – 'అల్లరి' యగు,
చివరి రెండక్కరంబులు – చెల్లు 'గిరికి';
'కుడ్య'మగును!ఆద్యంతముల్ గూడి;చెపుడు.

శ్రీ ఎ. వి. గోవిందరాజు,
హెడ్మాష్టరు – తోపుదుర్తి.

పదపూరణము

[విద్యార్థులు మాత్రమే వినిని పూరింపవలెను. చందాదారులుగాని వారు విధిగా రెండు అణాల తపాలాబిళ్ళలు పంపవలెను. లేనిచో వారిపేర్లు ప్రకటింపబడవు.]

పదము		అర్థము	పదము		అర్థము
1. క———ము	...	ఒకపక్షి	6. క———ము	...	ఒకభాష
2. క———ము	...	పాత్ర	7. క———ము	...	తాబేలు
3. క———ము	...	ఒకపుష్పము	8. క———ము	...	యుద్ధము
4. క———ము	...	మలినము	9. క———ము	...	తలుపు
5. క———ము	...	ఒకలోహము	10. క———ము	...	గ్రామాధికారి

కూర్పరి : శ్రీ వాడ్రేవు శేషగిరిరావు,
ట్రయినింగు విద్యార్థి -అమలాపురం.

జనవరినెల చిత్రప్రశ్నలు

(1953 సం॥ జనవరి సంచికలో ప్రకటింపబడిన)

వివేకప్రశ్నలు

అను చిత్రప్రశ్నలకు సమాధానములు

౧. అంబకము. ౨. విజయవాడ.

* * *

చందా నెం. రెండుప్రశ్నలకు సరియైన జవాబులు పంపినవారు

చి॥ కొణిదెన వెంకటసుబ్బారావు - విద్యార్థి - కొణిదెన
861 ఎ. వి. గోవిందరాజుగారు, హెడ్మాష్టరు - తోపుదుర్తి
బాడా అచ్చుమునాయుడుగారు - గంగుపేట
458 అల్లంరాజు సూర్యారావుగారు - హెడ్మాష్టరు - శృంగవరము
521 బంగారం - ట్రయినింగు విద్యార్థి - అమలాపురం
76 గూడాల నాగభూషణంగారు - టీచరు మేనేజరు - గంగలకుర్రు
333 ఆణివిళ్ళసోదరులు - టీచర్సు - మెరకచామవరం
ఎ. యల్. నరసరాజుగారు - టీచరు - తిమ్మాపురం
566 బగ్గాం సింహాచలంగారు - టీచరు మేనేజరు - పాతబగ్గాం
695 కలిదిండి సత్యనారాయణరాజుగారు - టీచరు - మొయిద
230 రేగిడి సత్యనారాయణగారు - మేనేజరు - కోటిపాం
363 చింతాడ రాములుగారు - టీచరు - రామదాసుపేట
565 తిరువరంగం రంగయ్యగారు - మేనేజరు - పాశిగంగుపేట
కౌసులనాటి హనుమచ్ఛాస్త్రిగారు - టీచరు - గంగవరం
659 కె. యల్. నారాయణప్పగారు - టీచరు - న్యామద్దల
184 కూచిభొట్ల పరశురామశాస్త్రిగారు - హెడ్మాష్టరు - పోలుకొండ
439 ఆర్. సుబ్రహ్మణ్యంపంతులుగారు - గంగలకుర్తి అగ్రహారం

రెండవ ప్రశ్నకుమాత్రమే

బూరాడ గోపాలంగారు - గెడ్డవానిపేట
180 చి॥ దుంప నారాయణమూర్తి - విద్యార్థి - అడపాపేట
చి॥ జొన్నలగడ్డ పుల్లయ్య - 5 వ తరగతి విద్యార్థి - హనుమంతునిపాడు
156 దుంప రామమూర్తిగారు - టీచరు - చింతపల్లిపేట
173 ఎ. వెంకటరత్నంగారు - టీచరు - శనివారపుపేట

పదపూరణము - సమాధానములు

1. పవనము
2. పయనము
3. పతాకము
4. పఠనము
5. పసరము
6. పరువము
7. పటాలము
8. పలలము
9. పరుషము
10. పదిలము

సరియైన జవాబులు పంపిన విద్యార్థులు

చందా నెం.

521 చి॥ బంగారం – ట్రయినింగు విద్యార్థి – అమలాపురం
చి॥ జొన్నలగడ్డ పుల్లయ్య – 5 తర. విద్యార్థి – హనుమంతునిపాడు
180 చి॥ దుంప నారాయణమూర్తి – విద్యార్థి – అడపావేట
చి॥ గెంబలి శ్రీరాములు – విద్యార్థి – కె. క్రిష్ణాపురం
చి॥ కొణిదెన వెంకటసుబ్బారావు – 5 వ తర. విద్యార్థి – కొణిదెన
చి॥ యలమంచిలి కోటేశ్వరరావు – 7 వ తర. విద్యార్థి–పోలుకొండ

వింతపదములు - పొడుపుకథలు

[బాలబాలికలారా! ఈక్రిందకొన్ని వింతపదములు–పొడుపుకథలు ఉన్నవి. వీటి సమాధానాలు చాలగమ్మత్తుగా ఉంటవి. మీరందఱు వీటిని చదివి చక్కగా నేర్చుకోండి. మీకు తెలిసినపొడుపుకథలుంటే వ్రాసి పంపండి. కాని మీరువ్రాసేవి చాలగమ్మత్తుగా ఉండాలి.]


పదము	జవాబు
మామ కాని మామ	చందమామ
కారు కాని కారు	షికారు
సందు కాని సందు	పసందు
కోడి కాని కోడి	పకోడి
లయము కాని లయము	ఆలయము
ముదము కాని ముదము	ఆముదము
దానము కాని దానము	నిదానము
పాలు కాని పాలు	పాపాలు
మానము కాని మానము	విమానము
కలి కాని కలి	చాకలి

కూర్పరులు : శ్రీ చింతాడరాములు: శ్రీ ఎ. యల్. నర్సరాజు.

* * *

ఏకాలమందైనా ఆకు రాలనిచెట్టు ... ఈతచెట్టు
ఫలించగానే మరణించుచెట్టు ... అరటిచెట్టు
పువ్వులు కనుపించనిచెట్టు ... మేడిచెట్టు
అందము దిద్దుకొనే సాధనము ... అద్దము
మూడుకానులతో ఎంతదూరమైనా పోతుంది ... పోస్టుకార్డు
అందఱూ తాకగా, అమ్మవంగగా, అయ్య కట్టుతాడు } తాళిబొట్టు

— శ్రీ ఎ. వి. గోవిందరాజు.



వృత్తివిద్యలు

పూర్వపు విద్యావిధానమునకు, నేటి విద్యావిధానమునకు, ఎంతో వ్యత్యాసమున్నది. ఆ కాలములో ప్రతివిద్యార్థియేదో ఒక కళలో సంపూర్ణ ప్రావీణ్యమును పొందేవాడు. అట్టి ప్రావీణ్యముతో స్వతంత్రముగా జీవించుటకే పాటుపడేవాడు. ఒకరి క్రింద తాబేదారిగా పనిచేస్తూ అస్వతంత్రముగా బ్రతుకుటకు ప్రయత్నం చేసేవాడేకాదు. "ఉద్యోగం పురుషలక్షణం" అని మన పెద్దలు ఏ పరమార్థంతో పేర్కొన్నారోకాని నేడది మలినార్థ సంకలితమై పోయింది. ఆనాటి వారికికూడా ఉద్యోగాభిలాష లేనేలేదని చెప్పలేముకాని నేడున్నంత నీచముగా ఉండలేదని మాత్రం చెప్పవచ్చు, ఎందుకంటే స్వతంత్రముగా జీవించుటకు ఆనాడు సంఘములోనేగాక విద్యావిధానములోకూడ ఎన్నో అవకాశాలు చూపబడ్డవి. అందువల్ల ప్రతివిద్యార్థియు స్వతంత్ర జీవనోపాధియే పరమావధిగా ఎంచుకొని యేదో ఒక కళను సంపూర్ణముగా అభ్యసించేవాడు.

ఇట్టి ఉత్తమకాంక్ష నాటివిద్యార్థిసంఘములో ప్రబలుటచేతనే శాఖోపశాఖలుగా కళలు విస్తరిల్లినవి. సర్వతోముఖముగా పెంపొందినవికూడ మొత్తము లెక్కించిన ఆ కాలములో అఱువది నాలుగు కళలు సాంగముగా బోధింపబడినట్లు తెలుచున్నది. వీనిలో సాహితీకళలతోపాటు లలితకళలు; లలితకళలతోపాటు అన్నిరకములైన వృత్తి విద్యలు చేర్చబడినవి. ప్రతి కేంద్రవిద్యాలయములోను ఈ కళలన్నియు బోధింపబడెడివి. అనుబంధ విద్యాలయములలో కూడ వీనికి సంబంధించిన ప్రాథమిక విషయములు బోధింపబడెడివట. అయితే ఆ నాటి విద్యాలయములు మహారాజుల పోషణము క్రింద ఉండేవి గనుక ఏలాటి కొఱతలు లేకుండ అత్యుత్తమ స్థాయిలో నిర్వహింపబడుతూ వుండేవి. ఆచార్యులకు అన్నవస్త్రముల గుఱించి ఆలోచనయే లేదు. ఇక విద్యార్థులకన్ననో ఉచితవిద్య; ఉచితభోజనము, ఉచితనివ సము: అన్నియు ఉచితములే. పై పెచ్చు అభ్యస్తకళలలో ప్రావీణ్యము మెఱసినవారికి రాజసన్మానములు, వెలలేని పారితోషికములు. ఇక కళలెందుకు పెంపొందవు ? కళాభ్యసనమునందు విద్యార్థు లెందుకు పోటీలు పడరు ? అందువల్లనే ఆ నాడు జగద్విఖ్యాతిగాంచిన మహాపండితులు, మహాకవులు, శిల్పాచార్యులు, నాట్యాచార్యులు, గాయకశిరోమణులు, ఉత్తమ గృహనిర్మాతలు, ఎందరెందరో కళాప్రపూర్ణులు వెలిసినారు. నేటిభారతజాతికీర్తి సౌధానికి వారే మూలస్తంభాలు.

ఆంగ్లేయుల పరిపాలనములో మనజాతీయ

విద్యావిధానమంతయు తలక్రిందులైనది. స్వతంత్రజీవనకాంక్ష చచ్చిపోయి బానిస జీవనము పాతుకొని పోయినది. దానిని పెకలింప నేమతరముగాకున్నది. పరాధికారము నశించి స్వేచ్ఛావాయువులు పీల్చుచున్నప్పటికి ప్రజాసంఘములో బానిసభావము లంతరింపలేదు. ఈ పని జరుగవలెనన్న ఇప్పుడున్న విద్యావిధానము పూర్తిగా మారిపోక తప్పదు. మారవలెనని అందఱు గోరుచున్నారు. అందుకు తగిన విధానములను ప్రభుత్వముగూడఅన్వేషించుచున్నది. ఈ సందర్భములో మా అభిప్రాయమును గూడ మనవిపూర్వకముగా తెలియజేయుచున్నాము.

నేడు దేశమంతటను అన్నిరకములైన విద్యాలయములు స్థాపించ బడుతున్నవి. ప్రజలలో విద్యాప్రబోధము కలిగినది. ఈ ప్రబోధము చచ్చిపోకుండ ప్రజలలో -ముఖ్యముగా విద్యార్థిలోకములో- స్వతంత్రజీవనబీజములను నాటుటకు ప్రభుత్వము సత్వర ప్రాథమిక చర్యలు కొన్నితీసుకోవలెను. ప్రాథమికవిద్య మొదలుకొని ఉన్నతవిద్య వఱకుగల అన్నిసంస్థలలోను వృత్తివిద్యలకు తగినంత ప్రాధాన్యమీయవలెను. ప్రతిసంస్థకు ఒకవృత్తి విద్యాసంస్థను అనుబంధముగా నెలకొల్పుటకు నిబంధించవలెను. అవసరమైతే దానిని నిర్వహించుటకు ప్రభుత్వమే పూనుకొనవలెను. కేవలము భాషాప్రాతిపదికమీఁదనే విద్యను లెక్కింపరాదు. చదువను, వ్రాయను, వచ్చినచాలును. ఆయావయస్సులకు, ఆయాశక్త్యులకు, తగినట్లు విద్యార్థులు తమయభిరుచుల కొలంది వృత్తివిద్యలు నేర్చుకొనుటకు చాలినంత యవకాశముండునట్లు చూడవలెను. అందఱికీ ఒకేరకమైన విద్యావిధానము నిబంధించుట భిన్నభిన్న మనోవికాసములను, అభిరుచులను, అరికట్టుటయే యగును.

జపానుదేశములో ప్రాథమిక దశయందు బాలబాలికల యభిరుచులను గమనించి, అందుకు తగిన చిన్నచిన్న పరిశ్రమలను గల్పించి, తద్ద్వారా వారికి స్వతంత్రజీవనమార్గమును చూపింతురట. అంతేగాకుండ ఆ పిల్లలు తయారుచేసిన విసనకర్రలను, మట్టిబొమ్మలను, గాజుపూసలను, కాగితపుపూలచెట్లను, తదితరసామానులను ప్రభుత్వమేకొని, యాద్రవ్యమును ఆయాసంస్థల కిచ్చుచుండునట. ఇందువల్ల సంస్థల పోషణమునకు కొంత ఆదాయము లభించుటయేగాక పిల్లలకు పరిశ్రమాభిరుచి ఎక్కువై వారు పెద్దయిన తరువాత స్వతంత్రముగా జీవించుటకుగూడ మంచి యవకాశ మేర్పడగలదు.

ప్రస్తుతము మనవిద్యా ప్రణాళికలలో గూడ కొన్నికొన్ని వృత్తివిద్యలు చేర్చబడినవి. కాని తగినంతదోహదము లేక అజాగళస్తనములవలె నిరుపయోగము లగుచున్నవి. మచ్చుకు ఒకమాట. నేటిసెకండరీ విద్యావిధానములో చిత్రలేఖనము, సంగీతము, నాట్యము, మొదలైన లలితకళలకు, వడ్రంగము, నేత, అల్లిక, కుట్టుపని, మొదలైన వృత్తివిద్యలకు, అవకాశమీయబడినది. కాని ఆచరణలో మాత్రము శూన్యము. ఇందుకు అనేక కారణాలున్నవి. ముందుప్రతి పాఠశాలలోను, వీనిని బోధించేఉపాధ్యాయులుండరు ఉన్నచోట వలసిన పరికరములుండవు. అన్నియున్నచోట కొందఱు సంపన్న విద్యా

వార్షికోత్సవములు-వర్ధంతులు

అమలాపురం :

ది **26-1-1953** తేదీన శ్రీ శ్రీనివాస ఎయిడెడ్‌స్కూలు భవనములో తృతీయ రిపబ్లిక్ దినోత్సవము జరుపబడినది. పాఠశాలాధికారి శ్రీ కొదుకుల సోమేశ్వరరావుగారిచే పతాకప్రతిష్ఠ చేయబడెను. పతాకవందనానంతరము పిల్లలకు మిఠాయిపంచిపెట్టబడెను. పురజనుల సహాకారముతో ఉత్సవము జయప్రదముగా జరిగెను.

—నేమాని వెంకట్రావు-హెడ్మాష్టరు.

న్యాకుద్రు :

ది 26-1-1953 తేదీ ఉదయము 6 గంటలకే ఎలిమెంటరీస్కూలు విద్యార్థులచే ప్రభాతభేరి గావించబడుటతో తృతీయ రిపబ్లిక్ దినోత్సవము ప్రారంభమయ్యెను. ఉన్నతపాఠశాలావరణములో పెక్కుమంది ప్రేక్షకులమధ్య 8 గంటలకు శ్రీ వి. గోపాల్ (S. P. L.) గారిచే పతాకారోహణము గావింపబడెను. తరువాత ఉన్నతపాఠశాలా ప్రధానోపాధ్యాయులు. శ్రీ సి. వి. నారాయణగారు పతాకమునుగూర్చి విపులముగా ముచ్చటించిరి. సాయంకాలము 3 గంటలకు ఊరేగింపు మహావైభవముగా జరిగెను. పిమ్మట 5 గంటలకు జరిగిన బహిరంగసభలో అధ్యక్షులు శ్రీ సి. వి. నారాయణగారు నాటి ఉత్సవప్రాముఖ్యమునుగూర్చి గొప్పగా ఉపన్యసించిరి. పిల్లలకు తినుబండారములు పంచిపెట్టబడెను.

—కే. యల్. నారాయణప్ప-టీచరు.

తణుకు :

తణుకు ఎయిడెడ్ కేంద్రోపాధ్యాయ సంఘ ద్వితీయ వార్షికోత్సవము కేంద్రపాఠశాలయగు శ్రీరామా ఎలిమెంటరీస్కూలులో ది 24-1-1953 తేదీన జరుపబడెను. సభకు పశ్చిమగోదావరిజిల్లా విద్యాశాఖాధికారులు శ్రీ అయ్యగారి వీర్రాజుపంతులుగారు అధ్యక్షతవహించిరి. శ్రీవారు ఐక్యసంఘముయొక్క ప్రాముఖ్యమునుగూర్చి ముచ్చటించిరి. సభకు కేంద్రసభ్యులు, పరీక్షాధికారులు, ప్రత్యేకాహ్వానితులు 15 మంది విచ్చేసిరి. ఉపాధ్యాయులు తమకష్టములను అధికారులకు నివేదించుకొనిరి. వీరేశలింగం హైస్కూలు ప్రధానోపాధ్యాయులు శ్రీ భమిడిపాటి కామేశ్వరరావుగారు ఉపాధ్యాయవృత్తినిగూర్చి హృద్యముగను,

---

౨౭౦ వ పేజీ తరువాయి

రులు వీటిని నేర్పుట న్యూనతగా తలంతురు. మఱికొందఱు ఈ పాఠాలబరువు చాలక ఉపరి ఇవి యెందుకులే. అని నిరసింతురు. ఈవిధముగా ప్రతిపాఠశాలలోను వృత్తి విద్యాబోధన నామమాత్రముగా నున్నదే కాని యేమాత్రము రాణించుటలేదు. ప్రభుత్వము దీనిని గమనించి యీవిద్యలు చక్కగా వెంపొందుటకు తగినసత్వరచర్యలు గైకొనవలెను. ప్రతిపాఠశాలలోను ఈవృత్తివిద్యాబోధనకు ఏలాటి కొఱతలేకుండ చూడవలెను. అంతేగాకుండ వివిలో ప్రత్యేకాభిరుచి గలవారికి తగినసహాయము నొనర్చి, ఇతర పరీక్షల బరువునుగూడ చాలవఱకు తగ్గించవలెను.

ఈ విధముగా వృత్తివిద్యలను ప్రభుత్వము తొలిచర్యగా బలపఱచినచో విద్యార్థులయందు స్వతంత్ర జీవనకాంక్ష రేకెత్తగలదు. తన్మూలముననిరుద్యోగసమస్యయు కొంతవఱకు పరిష్కరింపబడగలదు. ప్రభుత్వము నూతనవిద్య పరిశీలించి కార్యాచరణమునకు కడంగునుగాక! జై హింద్!

—సంపాదకుడు.

హాస్యరసపూరితముగను, ఉపన్యసించిరి. కార్యక్రమము. విచిత్రవేషధారణము, సంగీతము, ఆసనముల ప్రద ర్శనములతో పోటీలుజరిపి, గెలిచినవారికి, యోగ్యతాపత్రములు బహూకరింపబడెను. కార్యదర్శివందనముతో సభముగిసెను.

—[illegible] వేంకట నృసింహరావు [illegible]

చింతలపూడి :

చింతలపూడి తాలూకా ప్రాథమికోపాధ్యాయ యూనియన్ [illegible] పశ్చిమగోదావరి జిల్లాబోర్డు అధ్యక్షులు శ్రీ మాగంటి సీతారామదాసు యం. యల్. ఏ. [illegible] పశ్చిమగోదావరిజిల్లా విద్యాధికారులు శ్రీ [illegible] గారి [illegible] [illegible] చేసిరి. ఉపాధ్యాయులు [illegible] పలువురు [illegible] విధానమునుగూర్చి ఉపన్యసించిరి. నూతన యూనియనుకు అధ్యక్షులుగా [illegible], కార్యదర్శిగా శ్రీకొప్పిశెట్టి సుబ్బారావుగారును, ఎన్నుకోబడిరి. కార్యదర్శి [illegible] సభముగిసెను.

—కె. సు[illegible] కార్యదర్శి.

ముంగొండ :

ది 3-1-1953 తేదీన [illegible] ఎలిమెంటరీస్కూలు [illegible] కాశీపేటకేంద్ర [illegible] శ్రీ జి. సత్యంగారి అధ్యక్షతను [illegible] [illegible] [illegible] [illegible] తోడ్పాటుతో [illegible] [illegible] సభముగిసెను.

—[illegible] మల దీక్షితులు—[illegible]

[illegible] :

ది 30-1-1953 తేదీన అనంతపురం తాలూకా, బుక్కచెర్ల ఫిర్కా [illegible] శ్రీ అర్. రామన్నగారి అధ్యక్షతక్రింద [illegible] దినోత్సవమున్ను, గాంధిమహాత్ముని [illegible] జరిగెను. మహాత్ముని పటము మేళతాళములతో ఊరేగించబడెను. ఊరేగింపు [illegible] హెడ్మాష్టరు శ్రీ ఎ. వి. గోపాల[illegible]గారున్ను. వారి విద్యార్థులున్ను, [illegible] జనవాడలో బహిరంగసభ జరిగెను. మహాత్ముని జీవితచరిత్రనుగూర్చి, [illegible] [illegible]లు, టీచర్లు, గ్రామప్రముఖులు, ఉపన్యసించిరి. [illegible] పంచిపెట్టబడెను. ఈ కార్యక్రమమునందు గ్రామాధికారులు [illegible]

—[illegible]

స్వాగతము

[illegible] నూతనముగా [illegible] శ్రీ [illegible] [illegible] శ్రీ [illegible] ఉపకారమును [illegible] వందనములు [illegible]

ఏలూరు,
3—2—53

ప్రకటించువారు : [illegible]
[illegible]
ఏలూరు మ్యునిసిపల్ ప్రాథమికోపాధ్యాయ
యూనియన్ కార్యదర్శి.

1953 జనవరి చంద్రగ్రహణ ఫలములు

ఈ చంద్రగ్రహణము పృథివీరాశిలో సంభవించుటవలన ధాన్యమునకు కొరతయున్ను, పైరులకు హానియు, కరువు, భూకంపము, గనులలో ప్రమాదము మున్నగువానివలన దేశములో చిక్కులు తటస్థించును. చోరభీతి ఎక్కువగును. విదేశాంగ విషయములలో అకస్మాత్తుగ తీవ్రమైన నూతన మార్పులు వచ్చుసూచనలు కాన్పించుచున్నవి. ప్రభుత్వమునకు పరిపాలనాది కార్యములలో, శాసనసభ్యత్వాది విషయములలో కొన్ని ప్రతిబంధకము లేర్పడును. గొప్పరాజకీయులలో నౌకరికి ఆపదయు, సైనికావళి, నటకబృందము మున్నగువారిలో నౌకరికి అపాయము సంభవించును. రైలు, విమానము, వార్తాది సౌకర్యములలో కొన్ని ప్రమాదములు తటస్థమవును. రాజ్యాంగములో కొన్నిమార్పులు తప్పక జరుగును. లగ్నాధిపతియైన శని రాజ్యస్థానములో నుచ్చస్థితిలోనుండుటవల్లను, లగ్నమునకు గురుని కోణదృష్టి యుండుటవల్లను ప్రభుత్వము సదానముమీద, దీర్ఘాలోచన పరాయణత్వమున, బుద్ధిసూక్ష్మతచేతను ప్రతికక్షుల నెదుర్కొని విజయమును గాంచి తన ఆశయములను సాధించగల్గును. ఈ ఫలములు 1953 మే నెల 20 వ తేదీలోగా జరుగును. గ్రహణము పుష్యమీ నక్షత్రమందగుట వలన దానిని శుభకర్మలయందు విడువదగినది.

గ్రహణము సాయన మకరలగ్నమందు సంభవించుటవలన ఆయా సాయన జాతకలగ్నజులు యీ క్రింది ఫలములను గ్రహించనగును.

మేషమునకు జీవనగౌరవభంగములు, వృషభమునకు భాగ్యహానియు, వ్యవహారచిక్కులును, మిథునమునకు కార్యవిఘ్నములు, ఆరోగ్యభంగమును, కర్కాటమునకు కళత్ర, వ్యాపారములకు చిక్కులును, సింహమునకు రోగభయమును, శత్రుభీతియును, కన్యకు సంతానములో సుస్తీ, బుద్ధిభ్రంశమును, తులకు పితృదోషమును, గృహచ్ఛిద్రములును, వృశ్చికమునకు సోదరవర్గములో కీడు, ప్రయాణాది విఘ్నములను, ధనుస్సునకు ఆర్థికచిక్కులు, విద్యావిఘ్నములును, మకరమునకు శరీరపీడయు, క్లేశంబును, కుంభమునకు స్థానచలనము, దుర్వ్యయములును, మీనమునకు మిత్రులలో కీడును, ఆశాభంగములును తటస్థించును. గనుక వారు వారికి తగినవిధముగ శాంతిని చేసికొనుట యుక్తము. పుష్యమీనక్షత్ర జనితులు యథావిధిగా శాంతిని చేసికొనవలెను.

1951 లో ప్రచురింపబడిన ఫలములు అనుభవములని చదువరులు గుర్తించి యుండవచ్చును. ఈ ఫలములను వారు హర్షింతురుగాక !

లక్కావఝ్ఝుల సర్వయ్య,
జ్యోతిష్కులు
ఏలూరు.

మాసగోచార ఫలితాలు.

1953-15 ఫిబ్రవరి మొదలు 1953 మార్చి 14 వరకు

మేషం—కార్యాలస్యం-కాపట్యం-క్లాంతత్వము-కరచాలనభావములు, వృథాప్రయాసము.

వృషభం—మిత్రనింద-మిథస్సల్లాపములు-మితభాషణము-మిథ్యాప్రగల్భములు-మిత్రలాభము - మితిమీరిన వ్యయం.

మిథునం—విశ్వజనీనస్నేహము-విద్వజ్జనగౌరవము- ఉత్తమకులీనసమాగమలాభము - దైవచింతన - పరోపకారము-శుభపుణ్యకార్యపరత్వము.

కర్కాటకం—శీఘ్రకార్యలాభం-సేవాజనాదరణ-చింతాసాగరము-శివపూజ-ద్రవ్యలాభము.

సింహం—ఆలోచనాందోళనము-వివిధలాభగోష్ఠులు-పుణ్యకార్యచింత-ఉపకారభావము - ఉపకారక్రియాశూన్యము-బంధుమిత్రప్రియలాభములు.

కన్య—కష్టకాలము-క్రయవిక్రయనష్టములు-కాంతాపీడ-స్ఖలితమనస్సు-మనవిశోధము.

తుల—దూరదేశస్థితి-విద్యాగోష్ఠి-వేదాచారము-మనోవ్యాకులము-గౌరవహాని.

వృశ్చికం—అకాలభోజనం- అమితవ్యయము-విద్యావ్యాసంగము-స్వస్థలత్యాగము-దూరగ్రామసంచారము.

ధనుస్సు—బంధులాభము-కార్యసాఫల్యము-కవితాగోష్ఠి-అమితలాభము-వాణిజ్యప్రాప్తి-వరిష్ఠాచారసంపత్తి పశువృద్ధి-క్షీరపానము-నైతికకర్మనిష్ఠ.

మకరం—సంతానాందోళన-లాభసూచన-వస్తువిక్రయలాభము - అమితచిత్త-సద్గోష్ఠి - గంభీరాలోచనలు-కుమారకానందము-కులాచారము.

కుంభం—మానసికపీడ-సమానాదాయవ్యయములు-బంధుజనశుభప్రాప్తి- దూరప్రయాణము-విక్రమత్వము - వివిధవ్యాపారమనస్సు.

మీనం—ధనధాన్యలాభం-ధర్మచింత-చారలాభము-తంత్రాకార్యకరణము-భృత్యాదరణ - సేవకాభివృద్ధి-జనగౌరవము-లౌకికవ్యాపారలంపటత్వము-అనువ్యాపారలాభములు-శుభపుణ్యకార్యాలోచనలు.

మీమీ జాతక కుండలిని అనుసరించి మీగోచారఫలాలు పరిణామము చెందుచుండును.


(ఈ సంవత్సరములో కార్తికపౌర్ణమి - అశ్వని నక్షత్రముతో కలియుటవల్ల అక్కడక్కడ దేశములో ధూమకేతుసందర్శనము - గొప్పవారికి (ప్రభుజన) పీడలు - మరణపరిస్థితులు - నదీప్రవాహములు-నదులు పొంగుట - వ్యవసాయనష్టములు -జననాశము- ముఖ్యముగా నవంబరు మొదలు ఈ 1953 మార్చి వరకు ప్రభువులకు, ప్రజలకు విరోధాలేకాక యుద్ధప్రయత్నములుగూడ జరగ ఎక్కువ అశాంతి పూర్వకపు సూచనలు గనబడుచున్నవి.)

☞ సిద్ధయోగినీ, నాడీజ్యోతిషశాస్త్రరీత్యా జాతక, ముహూర్త, వాస్తు, ప్రశ్నవిషయములు, గ్రహపీడాది సర్వబాధలకు చికిత్సలు, మహాయోగి, మహాకాళీ, శక్తి, యామినీయోగిని, కవచ, యంత్రరాజసందర్భములు, సరసముగా తెలుపబడును.

వలయువారు నిలయము పేర వ్రాయవలెను.

దైవజ్ఞభూషణ, భిషగ్రత్న, : పండిత డి. యస్. యన్. శాస్త్రి,

శ్రీ శివనాడీ జ్యోతిర్నిలయమ్, పవరుపేట - ఏలూరు. (పశ్చిమగోదావరిజిల్లా)



పోణంగి:

ఏలూరుతాలూకా బోర్డు ప్రాథమికోపాధ్యాయ సంఘ సప్తమ వార్షికోత్సవము పోణంగి గ్రామములో బోర్డు పాఠశాల భవనమందు జరిగెను. మహారాజశ్రీ మాగంటి సీతారామదాసుగారు అధ్యక్షత వహించిరి. శ్రీమతి గారపాటి హైమవతీదేవిగారు, (దెందులూరు జిల్లాబోర్డుమెంబరు) ప్రారంభోత్సవము జరుపుతూ "ఉపాధ్యాయుల వేతనములు చాలా నీరసముగానున్నవి. వారినిగురించి ఆలోచించి యీకరువు కాలములో వారి కష్టములు తొలగుమార్గము గోచరించుటలేదు. ఈ కరువులో ఏవిధముగా వారు జీవనయాత్ర గడుపుచున్నారో చాలా ఆశ్చర్యముగానున్నది. అందుచేతనే ఉపాధ్యాయులలో నిరుత్సాహము జనించినది. కాని గవర్నమెంటువారు త్వరలో ఉపాధ్యాయుల విషయము ఆలోచించి వారిని ఒకదారికి చేర్చెదరని నమ్ముచున్నాను" అని చెప్పిరి.

యూనియను అధ్యక్షుడు పరశురామప్రసాద్ గారు ఆంధ్రరాష్ట్రమునుగురించి త్యాగముచేసి కీర్తిశేషులైన శ్రీ పొట్టి శ్రీరాములుగారి త్యాగమునకు జోహార్లు తెలిపిరి. వారి కుటుంబమునకు శాంతికలుగుటకుగాను సభవారు అందరు 3 నిమిషములపాటు భగవంతుని ధ్యానించిరి.

సభాధ్యక్షులు, శ్రీ సీతారామదాసుగారు ఉపాధ్యాయులగురించి ప్రస్తుతము నడచుచున్న ప్రభుత్వమునుగురించి, తెలుపుతూ "గవర్నమెంటువారు డబ్బులోటువల్ల ఎవరికిన్ని ఎటువంటి సదుపాయములు చేయలేకున్నారు. ఇది మన ప్రభుత్వము. మన సోదరుడు పాలించుచున్నాడు. గాన మన ప్రభుత్వముమీద మనము ఒత్తిడిచేయుటను భావ్యముగాదు" అని నుడివిరి, ప్రస్తుతము ఉపాధ్యాయులను అమలులోనున్నట్టియు, పంచాయితీవారు వసూలుచేయుచున్నట్టియు; వృత్తిపన్నును తగ్గించుటకు ప్రయత్నముచేయుదునని నుడివిరి. ఈ సభలో కె. వెంకటేశ్వర్లుగారు, B.A.,B.Ed., Senior Dy. Inspector of Schools Eluru West Range. K. V. N. శేషాచారిగారు, B S. & B.A.,B Ed , Senior Deputy Inspector of Schools Eluru East Range గారు ఉపన్యసించిరి.

T Parasu Ram Prasad,
Board Teachers' Union President.

ఉపాధ్యాయులకు కఱవు అప్పులివ్వాలి

అనంతపురంజిల్లా హిందూపురం తాలూకా కొలికొండ సెంటరు ఉపాధ్యాయులు జిల్లాసంఘ సహాయకార్యదర్శి బి. వెంకటసుబ్బయ్యగారి అధ్యక్షతను ది 17-1-53 తేదీన సమావేశమైరి.

ఉపాధ్యాయుల హక్కులను హరించు విద్యాశాసనములను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించాలని, రద్దయిన సర్టిఫికెట్లను ప్రభుత్వం వెంటనే మంజూరుచేయాలనియు, మద్రాసుప్రభుత్వము ఆంధ్రదేశమునకు విద్యాబడ్జెట్ లో చూపిన పినతల్లిప్రేమను ప్రత్యేకించి రాయలసీమకు చూపినపక్షపాతవైఖరిని, అధ్యక్షులు నిరసించిరి.

అనంతరం 1. సెంట్రలుకమిషను జీతాలు వెంటనే మంజూరుచేయాలని, 2. ఒకేగ్రేడు ఉపాధ్యాయులకు సమానస్కేల్లు యివ్వాలని, 3. అందరుపాధ్యాయులకు ఓటింగుహక్కునిచ్చి రహస్యబ్యాలెటు పద్ధతిని ప్రవేశపెట్టాలని తీర్మానాలుచేయబడెను.

— బి. వెంకటసుబ్బయ్య,

ANDHRA RASTRA PRARAMBHA VIDYA
Regd. M.N. 3766 Vol. 41. - No. 11

బల్పనూరు సెంటరు ఉపాధ్యాయసంఘ సమావేశం

ది 10-1-53 వ తేదీన పులివెందులతాలూకా బల్పనూరుసెంటరు సంఘసమావేశము వై. రామచంద్రారెడ్డిగారి అధ్యక్షతను జరిగినది.

తాలూకాకార్యదర్శి జి. వెంకటప్పగారు వుద్యమంగురించి వుపన్యసించిన తర్వాత కె. కొండారెడ్డిగారు, వి. ఎరుకలన్నగారు మాట్లాడిరి.

అధ్యక్షులు వుపన్యసిస్తూ ఆంధ్రరాష్ట్ర ప్రసక్తితెచ్చి వుమ్మడిరాష్ట్రముగా ఉండుటవలన ఆంధ్ర విద్యావిధానం దెబ్బతిన్నదికొబట్టి ప్రత్యేక ఆంధ్రరాష్ట్రముకొఱకు పాటుపడాలని చెప్పిరి. తర్వాత యీ క్రింది తీర్మానములు ఆమోదింపబడినవి.

(1) ఆంధ్రరాష్ట్రముకొఱకు ప్రాణాలర్పించిన పొట్టి శ్రీరాములుగార్కి జోహారులర్పించిరి.

(2) ఆంధ్రరాష్ట్రము ఉగాదినాటికి యేర్పడాలని, ఆంధ్రలోనే హైకోర్టు, రాజధాని వుండాలని, తీర్మానించిరి. ఈ తీర్మానం తంతిద్వారా వాంచూగార్కి పంపుటకు తీర్మానించిరి.

(3) ఈ తాలూకా తీవ్రకరువుకు గురియైనది కాన పిల్లల విద్యావిధానమునకు లోటులేకుండా ప్రతిస్కూలునకు రెండుపూటల సంఘటిత కేంద్రాలు యేర్పాటుచేయవలెనని తీర్మానించిరి.

వి. ఎరికలన్న,
తాలూకా కార్యవర్గసభ్యులు
పులివెందుల.

పాలవల్స అమిటి

ది 31-1-53 తేదీని యీగ్రామ ఎయిడెడ్ ఎలిమెంటరీ పాఠశాలలో శ్రీ డిప్యూటీ ఇనస్పెక్టరు వారగు బ్రహ్మశ్రీ C.H. పేరయ్య B.A;B.E.D గారి అధ్యక్షతను బాలుర జాతీయగీత ప్రార్థనతో నూతనముగ ఉపాధ్యాయసంఘ సమావేశము (cueter class) గం 11-30 లకు తెరువబడెను. యీసభకు గుమ్మలక్ష్మీపురం గవర్నమెంటు హయ్యర్ ఎలిమెంటరీపాఠశాల హెడ్మాష్టరు బ్రహ్మశ్రీ విస్సాప్రగడ రామమూర్తి B.A.B.E.D గారున్నూ, అసిస్టాంటు శ్రీ N. సూర్యనారాయణ గారున్నూ, మొండెంఖల్లు గవర్నమెంటు హయ్యరు ఎలిమెంటరీ పాఠశాల హెడ్మాష్టరు బ్రహ్మశ్రీ విద్వాన్ శ్రీపాద వేంకటావధాని B. A గారున్నూ, దయచేసిరి. యీ గ్రామపాఠశాల మానేజరగు శ్రీ పట్నాయకుని నరసింహులుగారిని సంఘ కార్యదర్శిగ సభ్యులు ఎన్నకొనిరి. శ్రీ S. V. అవధానులు గారున్నూ, శ్రీ V. రామమూర్తి గారున్నూ, సంఘముయొక్క యుద్దేశము, దానివలనకలుగు లాభములు, సంఘమునడుపు విధానములగూర్చి, పలురీతుల ప్రసంగించిరి. శ్రీ అధ్యక్షులవారు సభ్యులందరు ఏకీభవించి, సక్రమమైన పద్ధతులలో దీనినినడిపి, అందువల్లవచ్చెడి ఫలితములను పొందుటకై మిక్కుటముగ పాటుపడవలయునని సభ్యులను హెచ్చరించుచు, పలువిధముల ఉపన్యసించిరి. బాలుర 'జనగణమన' జాతీయగీతముతో సభముగిసెను. పిమ్మట స్వల్ప తేనీటివిందు జరుపబడెను.

పట్నాయకుని నరసింహులు,
కార్యదర్శి - టీచర్సు అసోసియేషను,
పార్వతీపురం ఏజన్సి రేంజి.

Edited by Sri M. Venkata Ratnam Garu, B. A., & Printed and Published by Sri E. Venkaiah Garu at his Pattabhirama Press, Eluru.